ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 4, 2005

తల్లిదండ్రులూ..పిల్లలకు స్నేహితులే

మనసా... తెలుసా

ఇంట్లో చేసేది పనికాదా ! ?

ఇంటి సంగతులు

Entered

కథా నిలయం

సాగర తీర రక్షణలో

భారత నావికా దళం

(4.12.2005 నుంచి
10.12.2005 వరకు)

హ్యాపీ బర్త్‌డే

అయిలమ్మ 2సం॥, 4.12.2003 సుమిత్ర-రమణ విశాఖపట్నం	వేణుప్రసాద్ 4సం॥, 4.12.2001 స్వరూప-వెంకటయ్య ముజాహిద్‌పూర్-రంగారెడ్డి	ఎన్. మేఘన 1సం॥, 4.12.2004 లీలాకుమారి-సుధీర్‌కుమార్ క్రాంతినగర్-విశాఖపట్నం	జె. వినీష 1సం॥, 4.12.2004 నాగేంద్ర-అప్పారావు గువ్వలగూడెం-ఖమ్మం	ప్రణీత్ బాబు 5సం॥, 5.12.2000 అనిత-రమేష్ బాబు నిజామాబాద్
పి. షణ్ముక వినయ్ 9సం॥, 5.12.1996 సుజాత-వి.వి.సత్యనారాయణ విశ్వేశ్వరాయపురం-తూ॥గో॥	సిహెచ్. స్నిద్ధశ్రీ 1సం॥, 5.12.2004 పావని-శ్రీరామ్ నర్సీపట్నం-విశాఖపట్నం	డి. డేవిడ్ లివింగ్‌స్టన్ 2సం॥, 5.12.2003 మేరీలత-సురేష్ పాణ్యం-కర్నూలు	షేక్ అస్రిఫూన్ 7సం॥, 5.12.1998 షేక్ మాభి ప్రత్తిపాడు-గుంటూరు	ఎస్. తస్లీమ్ 6సం॥, 6.12.1999 ఖాదర్ సుల్తానా-రహీమ్ విజయవాడ
వి. దిలీప్ కుమార్ 5సం॥, 5.12.2000 అనురాధ-మురళి చీడిగ-తూ॥గో	పి. శ్రీవాసవ్ 1సం॥, 6.12.2004 పద్మ-రాజు జిన్నూరు	జి. పూజితశ్రీ 1సం॥, 6.12.2004 పరిమళజ్యోతి-కృష్ణమూర్తి పత్తికొండ-కర్నూల్	ఎం. శ్రీజ్యోతి 8సం॥, 6.12.1997 దేశాలమ్మ-పెద్దిరాజు విశ్వేశ్వరాయపురం-తూ॥గో॥	పి. దేవకుమార్ డిసెంబర్-7 పద్మ-రమేష్ తూటికుంట్ల-ఖమ్మం
లావణ్య- మహంతేష ఆచారి డిసెంబర్-7 నాగలక్ష్మి-విరేష్ ఆచారి కోసిగి-కర్నూలు	పి. దైవావేణి 1సం॥, 10.12.2004 పద్మ-రమేష్ తూటికుంట్ల-ఖమ్మం	జి. అభిషేక్ సుజాత-మధుమూర్తి నల్లగొండ	జి. వికాస్ 4సం॥, డిసెంబర్-2001 వరలక్ష్మి-ప్రకాష్ మిర్యాలగూడ-నల్లగొండ	వంశీకృష్ణ మణిమ్మ-దొరై పుంగనూరు-చిత్తూరు
ఎ. యామిని సుజన-శ్రీనివాస్ కండయపాళెంగేట్-నెల్లూరు	అంబిక వెంకటనర్సమ్మ-వెంకటేశ్వర్లు రెబ్బవరం-ఖమ్మం	డి. కార్తిక్ లక్ష్మి-సుబ్రమణ్యం ఉస్మాన్‌నగర్-కడప	డి. సన్ని 6.12.2005 అరుణ-కృష్ణ సుబ్లేడు-ఖమ్మం	సాయిశ్రీ సత్యనారాయణ కొత్తపేట-శ్రీకాకుళం

ఈ వారం అతిథి

మన అతిథిగురించి...

పేరు	:	యార్లగడ్డ నాయుడమ్మ
పుట్టిన తేదీ	:	1-6-1947
పుట్టినఊరు	:	కారంచేడు
విద్యార్హతలు	:	ఎం.బి.బి.ఎస్ ఎం.ఎస్.(జనరల్ సర్జన్)
వృత్తి	:	వైద్యం
నచ్చిన వ్యక్తి	:	మదర్ థెరిసా
నచ్చిన అంశం	:	మంచితనం, మానవత్వం
నచ్చని అంశం	:	భేషజం
హాబి	:	పుస్తకపఠనం

వైద్యం వ్యాపారాత్మకం కారాదు

దైనందిక జీవితంలో ఇప్పుడు ప్రతిఅంశం వ్యాపారమయంగా మారుతోంది. ప్రతిరంగంలోనూ కమర్షియలైజేషన్, గ్లోబలైజేషన్ ప్రవేశించింది. తెలిసో, తెలియకో వాటిని మనం ఆమోదించాం. నడిసముద్రంలోకి వచ్చాక వెనక్కితిరిగిచూసుకుంటే ఏంలాభం? అన్ని రంగాల్లో విలువలు ప్రపంచీకరణకు అనుకూలంగా, వ్యాపారాత్మకంగా మారుతున్నప్పుడు ఈ రంగం ఒక్కటే మినహాయింపు అనుకుంటే ఎలా? ఒక విద్యార్థి వైద్యుడుగా, అందులోనూ ఏదో ఒక రంగంలో ప్రత్యేకత సాధించిన నిపుణుడిగా రూపొందాలంటే ఎంత ఖర్చు అవుతోందో తెలుసా? ప్రైవేటు రంగంలో వైద్యవిద్య అభివృద్ధి అయిన తర్వాత ఈ ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. దీనినే 'పెట్టుబడి' అంటున్నారు. ఇంత పెట్టుబడి పెట్టిన తరువాత ఉచితంగానో, గ్రామీణప్రాంతాల్లోనో వైద్యం చేయడానికి ఎలా సిద్ధమవుతారు? అందుకే డాక్టర్లు కార్పొరేట్ హాస్పిటల్స్‌వైపు మొగ్గుచూపుతున్నారు. నగరాలకే పరిమితమవుతున్నారు. మేం వైద్య విద్యార్థులుగా చేరినప్పుడు చాలామంది పెద్దవాళ్ళు మాకు విలువల గురించి చెప్పారు. నైతికత గురించి బోధించేవాళ్లు. సమాజానికి ఎలా ఉపయోగపడాలో నూరిపోసేవాళ్ళు. సహజంగానే అవి మా మెదళ్ళలో ఇంకిపోయాయి. నేను అవిభక్త కవలలకు గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వైద్యం చేయగలిగానంటే ఆ బోధనలే కారణం. ఇప్పుడు అలా చెప్పేవారు లేరు. చెప్పినా వినే పరిస్థితి లేదు. అప్పట్లో ఇంత ఖర్చు కూడా అయ్యేది కాదు. అందువల్లే 'వైద్యో నారాయణ హరి' వంటి మాటలు ఇప్పుడు చెప్పలేం. అయితే దీనికి పరిష్కారం లేదా ... వుంది! ప్రభుత్వ రంగంలో వైద్య విద్యను చిత్తశుద్ధితో అభివృద్ధి చెయ్యాలి. వైద్యకళాశాలల్లో అవసరమైన అన్ని వసతులు ఏర్పాటుచెయ్యాలి. వైద్య విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలివ్వాలి. వారిలో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని, త్యాగాన్ని నింపగల అనుభవజ్ఞులైన బోధకులను నియమించాలి. నేను అవిభక్త కవలలకు విజయవంతంగా శస్త్రచికిత్స చేసివుండవచ్చు. అయితే అది నా ఒక్కడి విజయమా? అలా అనుకుంటే సరికాదు. నా టీంలో పనిచేసిన ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఈ విజయంలో వుంది. నేను ఉద్యోగ విరమణ చేసే నాటికి నాలా కొద్దిమందిని తయారుచేస్తేనే నేను విజయవంతం అయినట్టు! ఈ తరహా ఆలోచనను వైద్యవిద్యార్థులు, ఉపాధ్యాయులు అలవర్చుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల ప్రకారం జాతీయ తలసరి ఆదాయంలో 5శాతం వైద్యరంగానికి కేటాయించాలి. మనదేశంలో 1.3శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. 'స్వేచ్ఛా రాజ్యం' గా చెప్పే అమెరికాలోనే వైద్య విద్యకు నలభై నుండి 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అక్కడి ప్రజలకు వైద్యం అందించడానికి ఎన్నో పథకాలు వున్నాయి. ఇక్కడ...! పరిస్థితులన్నీ భిన్నం ... అందుకే పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. అయితే పతనమవుతున్న విలువలు మళ్లీ ఉత్థానమవుతాయి. మంచి ఆదర్శాలు, మంచి అలవాట్లు వున్న భావితరం ఆ విలువలను మళ్ళీ నిలబెడుతుంది. ఉన్నతలక్ష్యం వైపు సాగిపోయే ఆ భావితరమే భవిష్యత్ ఆశాదీపం.

యార్లగడ్డ నాయుడమ్మ

ఈ సంచికలో...

టపా	...	2
మనసా తెలుసా		3
టర్నింగ్‌పాయింట్		4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మనమూ మన నమ్మకాలు		20
ఓ ఊరి కథ	...	21

ఇంకా...

నేర్చుకుందాం రా 7

పోస్టుకార్డుపై పెయింటింగ్

సీరియల్ 8

మాధవి

కథ 18

వెలుగు రవ్వలు

ఆరోగ్యం	...	17
ఓ మంచి పుస్తకం	...	19
అవీ... ఇవీ		22
విజ్ఞానవీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

అట్టమీది కథ

చదువుకునే వయస్సులో స్కూలు మాష్టార్లతోనూ, టీనేజీ వయస్సులో పోకిరీకుర్రాళ్లతోనూ, పెళ్లయిన తరువాత భర్త అత్తమామలతోనూ ఇలా చెప్పుకుంటూ పోతే... ఆడపిల్లలు పడే కష్టాలకు పరిహద్దులు కనిపించవు. పుట్టిన ప్రతి ఆడపిల్లా ఏదో ఒక రకమైన హింసకు గురికావడం నేటి సమాజంలో మనం చూస్తున్నాం. ఇలాంటి అరాచకాలను ఇంకానా! సాగనివ్వొద్దు!! మేలుకో సోదరీ మేలుకో... గొంతు విప్పి గర్జించు... అని చెప్పిన తీరు బాగుంది. ఆమె ఆరోగ్యమే ప్రపంచ ఆరోగ్యమనీ, పరిపూర్ణమైన స్వాతంత్ర్యం వారికి కావాలనీ నవంబర్ 25 నుండి డిశంబర్ 10 వరకు అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'మేలుకో సోదరీ మేలుకో' అంటూ అందించిన అట్టమీది కథ ఆడపిల్లలు భరిస్తున్న హింసను చూపింది. ఓ ప్రత్యేకమైన శైలిలో విప్లవాత్మకమైన చిత్రాలనందించింది. నిరక్షరాస్యులు అర్థంచేసుకునే రీతిలో ముఖచిత్రాన్ని తీర్చిదిద్దిన తీరు బాగుంది.

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక, కృష్ణా

కవర్ పేజీ

కవర్ పేజీ చాలా బాగుంది. ఈ వారం అతిథిలో విద్యాసాగర్ వివరించిన అంశాలు బాగున్నాయి. చిన్నారుల బర్త్‌డే విషెస్ కలర్‌ఫుల్‌గా కనువిందు చేశాయి. నేర్చుకుందాంరా శీర్షికలో ఎలాంటి రంగులు ఎన్నుకోవాలో చక్కగా వివరించారు. టర్నింగ్ పాయింట్ శీర్షికలో ఆవిరి యంత్రమే ఇప్పటి యాంత్రిక శక్తికి మూలమని తెలుసుకున్నాం. సలహాలు శీర్షిక బాగుంది. ఇంటిసంగతులు, మనసాతెలుసా శీర్షికలు ఉపయోగకరంగా ఉన్నాయి. కవర్‌స్టోరీ బాగుంది. మహిళ లెదుర్కుంటున్న సమస్యలు, ఇప్పటికీ వారు పడుతున్న బాధలను వివరించారు. వీటిని తట్టుకోవడం సమస్యకు పరిష్కారం కాదని ఎదురుతిరగాలని వివరించారు. కొత్తగా విడుదలైన పుస్తకాలతోకూడిన సమాచారం పుస్తక ప్రియులకు ఉపయోగకరం.

జి. స్నేహాంజలి, ముడసర్లోవ, వైజాగ్

ఇంకానా సాగనివ్వొద్దు!!

అట్టమీది కథ 'ఇంకానా సాగనివ్వొద్దు!!' స్త్రీల జీవన సజీవదృశ్యాలను, వాస్తవిక దృక్కోణాలను వివరించింది. ఆడదిగా పుట్టినందుకు తన జీవితం కష్టాల కడలిగా మారుతోందని, దీనికి కారణం లైంగిక అసమానత్వమేనని చెప్పొచ్చు. ఈ పురుషాధిక్య ప్రపంచంలోని స్త్రీల స్థితిగతులను గూర్చి మేలుకో సోదరీ మేలుకో అంటూ ఆలోచనాత్మకంగా అందించిన తీరుకు కృతజ్ఞతలు. 'సినిమా కబుర్లు'లో రాజేంద్ర ప్రసాద్ పరిచయం నచ్చింది. కొంగ్రొత్తగా ముస్తాబయ్యే శీర్షికలతో మేం 'స్నేహ'ప్రపంచంలో విహరించాలని ఎదురుచూస్తూ...

రాజావలి, హిమకుంట్ల, కడప

ఫీలవ్వటమా...

ఈ వారం 'క్యాంపస్ ఛాట్' మమ్మల్నెంతగానో అలరించింది. 'ఫీలవ్వటమా అదొకప్పటి మాట' చాలా బాగుంది. ఈ మధ్యకాలంలో జరిగే సంఘటనలన్నీ ఇలాగే ఉంటున్నాయి. ముఖ్యంగా ఇది హైటెక్ ప్రపంచం. అమ్మాయిలు ఫాస్ట్‌గా ఉండడంతో పాటు అబ్బాయిలను ఆటపట్టిస్తున్నారు. ఇందులో ఉన్న సన్నివేశాలన్నీ టేకిటీజీగా ఉన్నాయి. జోక్స్ చాలా బాగా ఆకట్టుకుంటున్నాయి.

జె. శ్రావణి,స్వాతి, పాల్వంచ, చంద్రిక, ఎనికేపాడు, కృష్ణా

ఓ హెచ్చరిక

నవంబరు 20 స్నేహ లోని 'అట్టమీది కథ' ఇంకానా సానివ్వొద్దు. మేలుకోసోదరీ మేలుకో ఓ హెచ్చరిక. యావత్ ప్రపంచ మహిళా లోకాన్నీ మేల్కొల్పుతూ రాసిన ఈ వ్యాసాన్ని అభినందించని వారంటూ ఉండరు. ఐక్యరాజ్య సమితి 2005 నివేదిక ప్రకారం ప్రపంచంలో ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు తన జీవితకాలంలో అత్యాచారానికి గురౌతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు కుటుంబ హింసకు గురౌతున్నారు. ఈ వాస్తవాన్ని అందించిన మీకు మా కృతజ్ఞతలు.

సిరిపురపు సంపూర్ణ చంద్రిక, ఎనికేపాడు, కష్ణా

పాఠకులు పాల్గొనేట్లుగా...

ఎప్పటిలా స్నేహ అందరినీ అలరించే శీర్షికలతో మా ముందుకొచ్చింది. ఈ వారం అట్టమీది కథ ఇంకానా? సాగనివ్వకండి ఆలోచింపజేసింది. మిగతావన్నీ ఆకట్టుకున్నాయి. పజిల్, మినీవ్యాసం శీర్షికలను ప్రవేశపెట్టి పాఠకులను పాల్గొనే విధంగా చేయండి.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసి పురం, శ్రీకాకుళం టౌన్-1

అలరింపజేసింది

'ఎండమావి' కథ హైలైట్. అందరినీ అలరింపజేసింది. ప్రతి ఆదివారమూ స్నేహను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నందుకు మా అభినందనలు. కార్టూన్లు, రుచి, న్యాయసలహాలు ఇలా అన్ని శీర్షికలూ మా హృదయాలను ఆకట్టుకుంటున్నాయి.

కలకొండ ప్రభాకర్, చిమిర్యాల, నల్గొండ

"చెడు స్నేహాలు చేయకురా అని మొత్తుకున్నాను. అయినా వీడు వింటేనా? ఇపుడు నష్టమెవరికి? డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. చదువుపోయింది. ఆరోగ్యమూ చెడింది. ట్రీట్‌మెంటుకు బోలెడంత ఖర్చు" అని వాపోయే తల్లిదండ్రులు మనకు సదా కన్పిస్తూంటారు. ఇలా చెప్పినా పిల్లలు పక్కదారి పడుతున్నారంటే...

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,

ఫోన్ : 9849130141

తల్లిదండ్రులూ... పిల్లలకు స్నేహితులే

పద్దెనిమిదేళ్లొచ్చాయి. ఎలా మసులుకోవాలో తెలియదు...రోజూ రాత్రి త్వరగా కొంపకు చేరుకోవాలి. ఇదీ తెలీని వాడివి... నువ్వేం చదువుతావు... మమ్మల్నేం ఉద్ధరిస్తావు?

" సిగరెట్లు కాల్చడం తప్పని తెలీదూ... ఒకళ్లు చెప్పాలా వీడికి"

ఇంతలా దండిస్తున్నా... తమ పిల్లలు పెళ్లికి ముందే గర్భవతులు కావడం, బ్రౌన్‌షుగరుకు అలవాటు పడడం ఎలా సంభవించిందో తెలియక చాలా మంది తల్లిదండ్రులు తికమకపడ్తారు. పిల్లలు తమ మనోభావాలను పుస్తకంలా చదివేస్తారనీ, దానికనుగుణంగా నడుచుకుంటారనీ ఆశించకూడదు. విలువలతో కూడుకున్న భావాలను పిల్లలలో మొలకెత్తేలా తల్లిదండ్రులు చూడాలి. సహాయపడాలి. టీనేజీ పిల్లల్లో కనిపించే విపరీత ప్రవర్తన వెనుక తల్లిదండ్రుల పట్ల చాలారోజులుగా పేరుకుపోయిన అసంతృప్తి, వ్యతిరేకత కారణాలని పరిశీలనల్లో వెల్లడైంది.

"చెడు స్నేహాలు చేయకురా అని మొత్తుకున్నాను. అయినా వీడు వింటేనా? ఇపుడు నష్టమెవరికి? డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. చదువుపోయింది. ఆరోగ్యమూ చెడింది. ట్రీట్‌మెంటుకు బోలెడంత ఖర్చు" అని వాపోయే తల్లిదండ్రులు మనకు సదా కన్పిస్తూంటారు. ఇలా చెప్పినా పిల్లలు పక్కదారి పడుతున్నారంటే... వారి అంతరంగంలో ఎక్కడో తమ తల్లిదండ్రుల పట్ల తీవ్రమైన ద్వేషముందన్నమాట. తల్లిదండ్రులకు ఎదురు తిరగడం, వారి బోధనలను లక్ష్యపెట్టకపోవడం, కావాలని చెడు స్నేహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులను జయించామనే ఆనందం వారికి కలుగుతుంది. కుటుంబంలో మనశ్శాంతి లేకపోవడం, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి దుర్వ్యసనాలుండడం దీనికి కారణం కావొచ్చు.

ప్రత్యేక ఒప్పందమా...?!

టీనేజీపిల్లలనెలా పెంచాలో వైన్‌రైస్, డేవిడ్ వీర్‌మాన్‌లు ఓ పుస్తకం రాసారు. దీనిలో 'రూల్స్‌ని ఒక చార్ట్ మీద రాసి ఒక గోడ మీద వేలాడదీయాలి' అని తల్లిదండ్రులకు వీరు సలహా ఇస్తున్నారు. ఈ చార్టుపై తల్లిదండ్రులూ, పిల్లలూ సంతకం చేయాలి. దౌత్య సంబంధాల ఒప్పందాలు చేసుకున్న రెండు దేశాల్లా... వీళ్లు తమతమ ఫైళ్లను మార్చుకుని షేక్‌హ్యాండ్‌లూ ఇచ్చుకోవచ్చు. ఈ నిబంధనల పత్రాన్ని కాలానుగుణంగా సవరించుకోవడం, కొన్ని నిబంధనలను మార్చుకోవడం చేయొచ్చు. 'ఇలా ఒక ఒప్పంద పత్రాన్ని తయారు చేసుకోవడం రిఫరెన్స్ పేజీగా ఉపయోగపడుతుంది' అని ఈ రచయితలంటున్నారు. ఈ విధంగా ప్రతి కుటుంబమూ తనదైన ప్రత్యేక ఒప్పందాన్ని రూపొందించుకుని నిబంధనలను రూపొందించుకోవాలి.

టీనేజీ పిల్లలతో స్నేహం...

'టీనేజీ పిల్లలతో మేం స్నేహం చేయడమెలా సాధ్యం?' అని చాలామంది తల్లిదండ్రులు భావిస్తుంటారు. కుర్రాళ్లతో స్నేహం సాధ్యం కాదని మరికొందరు కరాఖండిగా చెప్తారు. తల్లిదండ్రులిలా భావించడం సక్రమమైన మార్గాలలో పిల్లలను పెంచాలనే వారి ఆశయాన్ని కూలదోస్తుందని Jay Mc Graw : 2002 అంటాడు.

'గట్టిగా దండించి చెప్తేనే వీళ్లకు బోధపడడంలేదు. ఫ్రెండ్లీగా చెపితే ఏం వింటారు?' అని కొంతమంది ప్రశ్నిస్తూంటారు. సహజంగా స్నేహమనగానే సమవయస్కుల మధ్యనే ఏర్పడుతుందని ఒక అపోహ ఉంది. పరిశీలించి చూస్తే మనం, వయస్సులో మనకన్నా పెద్దవారితోను, ఇటు చిన్నవారితోను స్నేహం చేస్తాం.

స్నేహలత... ఎవర్ గ్రీన్

భావసారూప్యత కలిగిన రాజకీయపార్టీలన్నీ ఒకచోటుకు చేరుకున్నట్టుగా ఒకే అభిరుచులు, అభిప్రాయాలు కలిగిన వారంతా స్నేహం కడతారు. ఇలా మన దైనందిన జీవితంలో ఏర్పరుచుకునే స్నేహాలు... మనం కాలేజీలో చదువుకున్నపుడో, బడిలో గడుపుతున్నపుడో ఏర్పడిన స్నేహాలంత గాఢంగా ఉన్నట్టనిపించవు. 'అప్పటి రోజులే వేరు. చిన్ననాటి స్నేహితులందించే మధురానుభూతులే వేరు' అని పలువురు చెప్పగా వింటుంటాం. బాగా ఆలోచిస్తే జీవితంలో మన ఎదుగుదలకు, అభివృద్ధికి స్ఫూర్తిదాయకంగా నిలిచే స్నేహితులు మన కెరీర్‌లో అడుగుపెట్టిన తరువాతనే మనకు పరిచయమవుతారు. పాతతరం స్నేహితులు గుర్తుకొచ్చినపుడు మనకు ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. దీనికి ఏకైక కారణం ఇరువురు తమ మనోభావాలను పంచుకోవడం, రహస్యాలను విప్పి చెప్పుకోవడం, మానసికంగా ఎక్కువ ఓదార్పు పొందడం అనే చెప్పుకోవచ్చు. అలాగని అటువంటి చక్కనిస్నేహం జీవితంలో ఎప్పుడూ రాదని అనుకోరాదు. ఎప్పుడైనా ఎవరితోనైనా గాఢమైన స్నేహబంధం పొందే అవకాశమెప్పుడూ ఉంటుంది. స్నేహం చేయడం విషయంలో మనమంతా పాజిటివ్‌గానే ఉంటాం. ★

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

గాంధీ కాకినాడకు రావటమే...

ఆధునిక భారతదేశంలో స్త్రీ, జనాభ్యుదయానికి ఎందరో మహిళా మణులు కృషి చేశారు. సావిత్రిపూలే, కందుకూరి రాజ్యలక్ష్మమ్మ, కమలాదేవి ఛటోపాధ్యాయ, సరోజినీ నాయుడు, ముత్తు లక్ష్మీరెడ్డి, యామినీ పూర్ణ తిలకం ఇలా యెందరో- వీరిలో భావజాలాన్ని పెంపొందించిన వారితోపాటు, కార్యరంగంలో దూకి స్త్రీల జీవన పరిస్థితులను మెరుగుపర్చిన వారు వున్నారు.

ఆంధ్రదేశంలో, స్త్రీ జనోద్దరణకు, సమాజంలో వారి జీవనస్థాయిని పెంచడానికి, దిక్కూ మొక్కూలేని అనాథలతోపాటు, సాంఘిక, ఆర్థిక వెనుకబాటుతనానికి గురైనవారిని ఉద్దేశించిన వారిలో, గుమ్మడి దుర్గా బాయమ్మ ప్రముఖులు (చింతామణి దేశముఖ్‌ను పెండ్లాడాక, ఈమే దుర్గాబాయ్ దేశముఖ్‌గా పేరొందారు)

1909 (జులై 15) సంవత్సరం, సాంప్రదాయ కుటుంబంలో 10-11 ఏళ్ల వయసులో బాల్య వివాహం, వైవాహిక జీవితం సజావుగా సాగలేదు. పెద్ద చదువులు చదివే అవకాశాలూ అప్పుడు లేవు. రాజమండ్రిలో పుట్టిన దుర్గాబాయమ్మ, కాకినాడకు మకాం మార్చి తల్లి కృష్ణవేణమ్మతో కలిసి, చిన్న స్కూలు పెట్టి, ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు నేర్పేవారు. చిన్నతనం నుండి, సాంఘిక, రాజకీయ కార్యకలాపాలపై మక్కువ ఎక్కువ. దృఢమైన అభిప్రాయాలు, నమ్మకాలు చిన్నతనం నుండే వుండేవి. తన స్వంత జీవిత అనుభవాన్నుండో, లేక సామాజిక వాస్తవికత వల్లనో, స్త్రీల కొరకు తన జీవితాన్ని అర్పించుకోవాలన్న కోర్కె ఆమెలో బలంగా వుండేది. కానీ కాకినాడలో వుంటూ, సాదా సీదా జీవితం గడుపుతున్న దుర్గాబాయమ్మకు ఇదెలా స్యాధ్యం ?

జీవితం చిత్రమైంది. అనుకోని మలుపులు తిరుగుతుంది. సాధ్యంకాదనుకున్న దాన్ని సాధించి తీరుతుంది. ఎత్తు పల్లాల్లో, ఎగుడు దిగుడుగా ముందుకు సాగుతూ ఉంటుంది. అదే క్రమంలో మనల్ని అబ్బురపరిచే ఘటనలతో, జీవిత గమనాన్నే మారుస్తుంది. 1920 దశకంలో, ఇలాంటి రెండు సంఘటనలు దుర్గాబాయ్ జీవితాన్ని సమూలంగా మార్చి వేశాయి.

గాంధీజీ 1919, 20లలో ఆంధ్రప్రదేశ్ పర్యటనకొచ్చారు. ఎక్కడకు వెళ్ళినా, జాతీయోద్యమానికి కావల్సిన నిధులు గాంధీ సేకరించేవారు. రాజమండ్రిలో ఆమె గాంధీని దర్శించారు. అందరూ పోగుచేసిన విధంగా తానూ, కొంత డబ్బు సేకరించి ఆయనకు సమర్పించింది. ఆ డబ్బు అందుకొంటూ ఆ చిన్నారి (అప్పుడామె వయసు 10-11 సంవత్సరాలే)చేతి బంగారు గాజులను చూసి, "ఇవి కూడా దేశం కోసం ఇవ్వవా" అన్నారు. అంతే, సంతోషంగా తీసి ఆయన చేతిలో పెట్టింది. ఆయనలో వున్న సమ్మోహన శక్తి అలాంటిది. మట్టి నుండి మాణిక్యాలను సృష్టించిన మహోత్తర ఆకర్షణ ఆయనలో వుండేది.

రెండోసారి దుర్గాబాయమ్మ, కాకినాడలో గాంధీని చూసింది. ప్రత్యేకంగా స్త్రీల సమావేశంలో గాంధీజీ పాల్గొని, మాట్లాడాలని ఆమె కోరారు. ఆ సమావేశానికి దేవదాసీలను, పరదా స్త్రీలను, సాంఘికంగా ఆర్థికంగా చికితిపోయిన మామూలు స్త్రీలను ఆమె ఆహ్వానించారు. కానీ సమావేశానికి, నాయకులు ఒప్పుకోలేదు. దుర్గాబాయమ్మ పట్టుబట్టింది. ఐదు వేల రూపాయలు నిధి సేకరించి ఇస్తే, ఏర్పాటు చేస్తామన్నారు. డబ్బు వసూలు చేసి, ఆమె సమావేశానికి గాంధీగారిని కలిసే వీలుకల్పించుకున్నారు. సభకు గాంధీ వచ్చారు. స్త్రీల స్థితిగతులను, వారి వ్యధాభరిత జీవితాల్ని గూర్చి, వారిని పైకి తీసుకురావాల్సి అవసరాన్ని గూర్చి, దుర్గాబాయమ్మ హిందీలో సరళంగా, విశదంగా మాట్లాడారు. గాంధీ ముగ్ధుడయ్యారు. రెండు నిముషాలని చెప్పి వచ్చిన గాంధీ రెండు గంటలు గడిపారు. అయన ఉపన్యాసాలను హిందీలో నుండి తెలుగులోకి, అప్పటి వరకు కొండా వెంకటప్పయ్య అనువదించేవారు. ఇక ఇప్పటి నుండి ఆ కార్యక్రమాన్ని దుర్గాబాయమ్మకు అప్పచెప్పారు గాంధీజీ. గాంధీ కాకినాడకు రావడం, ఆమె జీవితాన్ని గొప్పమలుపు తిప్పింది.

ఒక వందరూపాయల బ్యాంకు ఖాతాతో ఆరంభించిన ఆమె సాంఘిక సేవా కార్యక్రమాలు ఇంతింతై, వటుడింతై అన్నట్లు, మద్రాసులో, ఆ పిమ్మట హైదరాబాద్‌లో శాఖోపశాఖలుగా విస్తరించి వందల కోట్ల రూపాయలకు చేసే వనరులకు అభివృద్ధి చెందాయి. 'పిట్టకొంచెం కూత ఘనం' అన్న సామెతగా దుర్గాబాయ్ జీవితంలో జరిగిన మరో సంఘటన గూడా గుర్తుంచుకోదగిందే. కాకినాడలో కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు దుర్గాబాయమ్మ వయసు 13-14 ఏండ్లు మాత్రమే అయినా వాలంటీరుగా నమోదయింది. ఎగ్జిబిషన్ వద్ద ఆమెను వాలంటీరుగా వుంచారు. కొండా వెంకటప్పయ్య వచ్చి,, "టిక్కెట్టు లేకుండా ఎవరినీ, దేవుడైనా సరే, లోపలికి పంపడానికి వీల్లేదు. తెలిసిందా, " అని హెచ్చరించారు. అలానే జాగ్రత్తగా తన విధులు నిర్వహిస్తున్న సమయంలో, నెహ్రూ టిక్కెట్టు దగ్గరుంచుకోకుండా వచ్చారు. దుర్గాబాయమ్మ లోపలికి వెళ్ళడాన్కి వీల్లేదని నిక్కచ్చిగా చెప్పారు. అందరూ ఆశ్చర్యపోయారు. "ఎవరనుకొంటున్నావు. ఆయన నెహ్రూ" అన్నాడు. "ఎవరైనా సరే వెళ్ళనివ్వను. నా డ్యూటీ చేస్తున్నాను" అన్నారు. నెహ్రూ ఆమె ధర్మనిర్వహణకు మెచ్చుకొని అభినందించారు.

పైన మనం చెప్పుకొన్న ఘటనలు ఆమె వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడ్డాయి. ధృఢ చిత్తంతో పని చేయడానికి దోహదం చేశాయి. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని కఠిన కారాగార శిక్ష అనుభవించారు. రాజ్యాంగ నిర్ణాయక సభలో సభ్యురాలిగా పని చేశారు. స్వాతంత్ర సముపార్జన తర్వాత, జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో స్త్రీ సంక్షేమ విభాగాన్ని పర్యవేక్షించడానికి ఆమెను నెహ్రూ నియమించారు. మొక్కవోని దీక్షతో, నిర్భితితో, స్త్రీల సంక్షేమానికి పని చేసిన దుర్గాబాయమ్మ స్త్రీల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

☆

రెండువేలే...

మేమిద్దరం, మా నాన్న రెండో భార్య పిల్లలం. మొదటి భార్య చనిపోయింది. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. వారినీ మా అమ్మే పెంచింది. నాన్నకు 16 వేలు జీతం. త్వరలో రిటైరవుతారు. ఎస్ఆర్‌లో మా పేర్లు లేవు. నెలకు మాకు రెండువేలు ఇస్తారు. ఇప్పుడు మా దగ్గర లేరు. ఆయన మా దగ్గర నుంచి వెళ్లిపోయి దాదాపు ఏడు సంవత్సరాలయ్యింది. మేం కోర్టులో కేసువేయొచ్చా? వేస్తే మాకెంతొస్తుంది. మొదటి భార్య పిల్లలకెంతొస్తుంది. తెలుపగలరు.

వి. ప్రవీణ్, మిర్యాలగూడ.


సలహాలు

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

డాక్యుమెంట్లు లేవు?!

నా దగ్గర కొంత స్థలముంది. అది మా పూర్వీకులనుంచి వచ్చింది. అది ఎంత విస్తీర్ణంలో ఉందో నాకు సరిగా అవగాహన లేదు. ఆ స్థలాన్ని పక్కవారు ఆక్రమించుకున్నారు. ఆ స్థలం వారిదేనని స్టాంపులూ సృష్టించారు. ఆ స్థలంలో నాకు మిగిలింది ఆరు సెంట్లు. ఆ ఆరు సెంట్లకు సంబంధించిన స్టాంపు పేపర్లు నా దగ్గర లేవు. డాక్యుమెంట్లు లేవు. నేను మొత్తం స్థలాన్ని పొందగలనా? మార్గం ఉంటే చెప్పగలరు.

ఓ సోదరుడు, హైదరాబాదు

మీ నాన్నగారి మొదటి భార్యకు పిల్లలు ఉన్నారని అంటున్నారు. వారికీ మీ నాన్న గారి ఆస్థిలో సమాన హక్కు ఉంటుంది. వారికి ఎలాంటి హక్కులు ఉంటాయో, మీకు వాటిలో సమాన హక్కులు ఉంటాయి. మీరు, వారు, మీ నాన్నగారికి సమాన వారసులుగానే పరిగణించబడతారు.

మీరు ఏ ఆధారాలూ లేవంటున్నారు. మీ స్థలం మీకు రావడం చాలా కష్టం. మీ పక్కవారి దగ్గర స్టాంపు పేపర్లున్నాయంటున్నారు కదా. వాటిని పరిశీలించండి. దాంట్లో న్యాయబద్ధత ఉంటే సరి. ఏదైనా తేడా ఉంటే అది మీ పూర్వీకుల స్థలమని మీరు రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాతే మీరు మీ స్థలాన్ని పొందగలుగుతారు.

ఉభయచరం

కప్పను ఉభయచరజీవి అంటారు. అది నేలపైన నివసించ గలుగుతుంది. నీటిలోనూ జీవించగలుగుతుంది. ఇలాంటిదే మరొక ఉదాహరణచెప్పండి" అడిగాడు సైన్సు టీచరు క్లాసులో.

కాసేపటికి ఓ విద్యార్థి లేచి "జీడిపప్పు సార్ ! దాన్ని స్వీట్‌లోనూ వేసుకోవచ్చు. హాట్‌లోనూ వేసుకోవచ్చు" అన్నాడు.

పెండెం జగదీశ్వర్

ఇంటి సంగతులు

పి. జ్యోతి

ఇంట్లో చేసేది పని కాదా?

"ర... హీ! ఆఫీసులో హెవీ వర్కుతో పిచ్చెక్కిపోతోందే. ముగ్గురి పని నా ఒక్కదాని నెత్తి మీదే పడేశారు. చేయలేక ఛస్తున్నాననుకో. ఇంటికొచ్చేసరికి నా బుర్ర వేడెక్కిపోతోంది. నీ పనే బెటరే...హాయిగా ఇంట్లోనే ఉంటావు. నిన్ను చూస్తే చాలా అసూయగా ఉందే..."అంటోంది సింధు ఆఫీసునుంచి నేరుగా స్నేహితురాలు రోహిణి ఇంటికొచ్చేసి.

"అవునులే! హెవీవర్కుతో పిచ్చెక్కిందని నువ్వేగా అన్నావు. అందుకే ఈర్ష్యాసూయలు మొదలైనట్టున్నాయి. నువ్వు ఆఫీసుకెళ్లి శ్రమపడుతున్న మాట వాస్తవమే కావొచ్చు. కాదనను. నేనింట్లో గోళ్లు గిల్లుకుంటూ హాయిగా కూర్చున్నానని అనడమే నాకు నచ్చడం లేదు" అంది రోహిణి. స్నేహితురాలలా మాట్లాడడం చిరాగ్గా అనిపించిందామెకు.



"మరి... పిల్లలు, మీ ఆయన వెళ్లాకేం చేస్తావే? ఎంచక్కా టీవీ పెట్టుకుని వెధవ సీరియళ్లు చూస్తూ కూర్చోవడమేగా. లేదంటే హాయిగా పడుకుంటావ్" అన్నది సింధు

"అదే మరి. ఇంట్లో ఉండి నేనెన్ని పనులు చక్కబెట్టుకుంటానో చూసి నువ్వే ఇలా అంటే... ఎలాగే. అందుకే గృహిణి శ్రమకు గుర్తింపు లేదు. నేనే కాదు ఇంట్లో ఉండే వాళ్లందరూ ఎన్ని పనులు చేస్తారో చెబుతా విను. వీటి వల్ల డబ్బునూ ఆదా చేయొచ్చు" అంటూ చెప్పడం ప్రారంభించింది రోహిణి. అవేంటో మీకూ తెలుసుకోవానుందా...

ఇంటిపని మనమే చేసుకోవచ్చు. దీని వల్ల సమయానుసారంగా పనులు పూర్తవుతాయి. పనమ్మాయి ఖర్చూ తగ్గుతుంది. శరీరానికి వ్యాయామూ అవుతుంది. ఇంట్లోకి కావలసిన సరుకులు, కూరగాయాలు మనమే మార్కెట్టుకెళ్లి తెచ్చుకోవచ్చు. ఏ వస్తువులెన్ని కావాలో... ఎలాంటివి కావాలో చూసి తెచ్చుకోవచ్చు.

పిల్లల బస్‌పాసులు కట్టొచ్చు. స్కూలుకెళ్లి ఫీజులు చెల్లించొచ్చు. పనిలోపనిగా మీ పిల్లలెలా చదువుతున్నారో తెలుసుకొవచ్చు. సాయంత్రం పూట పిల్లలను చదివించుకోవచ్చు. ట్యూషన్ల ఖర్చు తప్పుతుంది. స్నాక్స్ వంటివి ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. బయటకొనే ఖర్చు తప్పుతుంది. ఆరోగ్యానికి ఆరోగ్యం కూడానూ. బట్టలు ఇస్త్రీ చేసుకొవచ్చు. కుట్లూడిపోయిన బట్టలను రిపేరు చేసుకోవచ్చు.

కరెంటు, ఫోను బిల్లులు ఇన్‌టైంలో కట్టొచ్చు. బ్యాంకుకెళ్లి డబ్బులు డ్రా చెయొచ్చు. డిపాజిట్ చేయాలనుకుంటే ఆ పనీ పూర్తిచేయొచ్చు.

ఈ పనులే కాకుండా...

పేయింటింగ్, డ్రాయింగ్, స్టిచింగ్, సంగీతం, నృత్యం, రచనలు చేయడం, పుస్తకాలు చదవడం వంటి వాటిలో ఎవరి మనసుకు నచ్చిన పనిని వారు చేసుకోవచ్చు. మనకునచ్చిన పనిని రోజూ కొంత సమయం చేయడం వల్ల మనసికానందం పొందొచ్చు. 'ఇది రాదే' అని బాధపడే బదులు ఏది వస్తుందో అది చేయడం మంచి పద్ధతి.

ఉద్యోగం చేయగలిగే అవకాశం మీకుందనుకోండి నిస్సందేహంగా చేయొచ్చు. చేయలేక పోయినప్పుడు 'ఇంట్లో ఖాళీగా ఉన్నాం' అనుకునే పనేలేదు. ఇలా ఎన్నో పనులు చక్కబెట్టుకోవచ్చు. దీని వల్ల భర్తపడే శ్రమను భార్య, భార్య శ్రమను భర్త కొంత తగ్గించొచ్చు. ఇంట్లో ఉండి ఇన్ని బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తున్నా... 'మీరేం జాబ్ చేయడం లేదా?', 'ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నారా?' అని అడిగేవారు చాలా మందే ఉంటారు. ఈ చేసేదంతా పని కాదా? అందుకే గృహిణి శ్రమను గుర్తించాలి. విలువనివ్వాలి. ☆

పరిమి శ్యామలారాధాకృష్ణ

పోస్టుకార్డుపై పెయింటింగ్

క్రిస్మస్... నూతన సంవత్సరం... సంక్రాంతి... ప్రతి సంవత్సరమూ ఈ సందర్భాలలో స్నేహితుల అభిరుచికి తగిన గ్రీటింగ్ కార్డులు కొనడం మీకు పెద్ద తలనొప్పిగా మారిందా?

ఎలాంటి గ్రీటింగ్ కార్డులనెన్నుకోవాలి? ఎలాంటి వాటికి మీ ఆప్తుల మనస్సు ఆహ్లాదపడుతుంది? ఈ ఆలోచనలతోనే మీ బుర్ర వేడెక్కిపోతోందా?

సరికొత్త గ్రీటింగ్ కార్డులను పంపి మీ బంధుమిత్రుల దృష్టిలో మీరు ప్రత్యేకంగా నిలిచిపోవాలనుకుంటున్నారా?

ఇదే మీ నిర్ణయమైతే... ఇందుకు మీ కళాత్మకతను వెలికితీయాల్సిందే మరి. ఎలాగంటే... చదవండి మరి.

"తోకలేని పిట్ట తొంభై ఆమడలు....."

ఈ పొడుపు కథ వింటే మీకేం గుర్తొస్తోంది. పోస్టుకార్డు. ఇదేంటి... గ్రీటింగులు తయారు చేయడమెలాగో చెబుతానంటూ మధ్యలో ఈ పోస్టుకార్డుల గొడవేమిటా అని విసుక్కుంటున్నారా. ఈ గ్రీటింగులకు, పోస్టుకార్డులకు లింకుంది మరి. ఈ పోస్టుకార్డుల ద్వారా కేవలం పదిరూపాయల ఖర్చుతో ఇరవై మందికి గ్రీటింగ్ కార్డులు పంపి శుభాకాంక్షలందించొచ్చు. అలాగే మీ కళాత్మకతను ప్రదర్శించడానికీ ఇదో చక్కటి అవకాశం.

ఇందుకు కావలసిందల్లా... తెలుపు, ఎరుపు, నీలం వాటర్ కలర్స్ / పోస్టర్ కలర్ బాటిల్లు, రెండు బ్రష్షులు. వీటిని మీరు పదే పదే కొనాల్సినవసరం లేదు. ఈ సంవత్సరం కొన్నారనుకోండి నాలుగైదు సంవత్సరాల వరకు ఇవి పనికొస్తాయి. అయితే... వాడిన వెంటనే బ్రష్‌లను నీటితో కడగడం, శుభ్రంగా తుడవడం, రంగు సీసాల మూతలను గట్టిగా బిగించడం మర్చిపోవద్దు సుమా.

మొదట మీకు తోచిన డిజైనును ఫ్రీ హాండుతో లేదా పెన్సిలుతో కార్డు మీద గీసుకోండి. వీటిపైన మీకు నచ్చిన రంగులను ఒక ప్యాలెట్ మీద రంగరించి మొదట అవుట్‌లైను వేయండి. ఆ తర్వాత లోపలి నుంచి స్ట్రోక్సు ఇవ్వండి. ఈ స్ట్రోక్సు వల్ల ఆ ఆకృతికి ముదురు రంగొస్తుంది. ఈ మూడు రంగులతోనే రకరకాల రంగులను తయారుచేసుకోవచ్చు. ఎలాగంటే... ఎరుపు, నీలం రంగులు కలిపితే ఆకుపచ్చ రంగు వస్తుంది. ఆకుపచ్చకు నీలం కలిపితే నలుపు రంగు, ఎరుపు, తెలుపు రంగులు కలిపితే గులాబీరంగు వస్తుంది. ఈ రంగులను మేళవిస్తూ ఐదేళ్ల చిన్నారులు మొదలు పెద్దవాళ్ల వరకు గ్రీటింగ్ కార్డులు తయారుచేసుకోవచ్చు.

ఈ మధ్య కాలంలో గ్రీటింగ్‌కార్డుల ఖరీదులు మిన్నంటుతున్నాయి మరి. శుభాకాంక్షలు ఫోన్లు ఇ-మెయిల్ ద్వారా పంపగల స్థోమత ఎంతమందికి ఉంది చెప్పండి?! స్వయంగా డ్రాచేసి, పెయింట్ చేసి శుభాకాంక్షలు రాసి పంపితే ... పంపేవారికి ఎనలేని ఆనందం... అందుకున్న వారికి ఎంతో తృప్తి అభిస్తాయి.

ఫోటోలో చూశారుగా... గ్రీటింగ్ కార్డులు ఎలా తయారుగా ఉన్నాయి. పోస్టు డబ్బాలో వేయడమే తరువాయి. ఇంకా ఎందుకాలస్యం... పోస్టాఫీసుకెళ్లి కార్డులు కొని, ప్రారంభించండి.

☆

మీరు తిన్నదే

"అంకుల్ కుక్క నాకిన మైసూర్‌పాక్ తింటే ఏమైనా ప్రమాదమా ? అడిగాడు ఆరేళ్ల అఖిల్ ఆంజనేయుల్ని

"ఏం ఎందుకలా అడుగుతున్నావ్" అన్నాడు ఆంజనేయులు

"ఇందాక మీరు తిన్న మైసూర్‌పాక్ అదే" చెప్పాడు అఖిల్

పెండెం జగదీశ్వర్

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

మాధవి

మాధవి నిమిత్తమాత్రురాలిగా ఇద్దరు రాజులపరమై మూడవరాజైన ఉశీనరుడి బారిన పడింది. 'కామించినకొద్దీ అందం రెట్టింపవుతుంద'ని కేవలం కాముకదృష్టితో మాత్రమే చూసే ఉశీనరుడు మాధవి అంతరంగ కల్లోలాన్ని పట్టించుకోడు. ఇద్దరు రాజుల వద్ద నిర్బంధ సంసారమనుభవించిన క్షోభను, ఇద్దరు కుమార్లను వదిలిపెట్టేయాల్సివచ్చిన కడుపుకోతను పట్టించుకోని ఈ రాజుతో చంబల్ నదీతీర విహారానికి వెళ్లకతప్పలేదు.

(22వ భాగం)

చంబల్‌నది దాటి ఆరావళి కొండప్రాంతం చేరారు. నలుచదరంగా వున్న ప్రదేశం చూసి భటులు తివాచీ పరచి, ఆహార పదార్థాలు, పానీయాలు పెట్టి ఉశీనరుడికి వినయంగా నమస్కరించి దూరంగా వెళ్ళిపోయారు. అంగరక్షకులు కూడా వారిని అనుసరించారు. ఇద్దరూ కూర్చున్నారు. ఎదురుగా లోయ. దానవతల కొండమీదినుండి తెల్లటి నురగలు కక్కుతూ జలపాతం. ఆ నిశ్శబ్ద వాతావరణంలో సెలయేటి ధ్వని చెవికి ఇంపుగా వుంది. అక్కడక్కడా పెద్ద వృక్షాలు, పైన నిర్మలమైన ఆకాశంలో అందమైన మేఘమాలికలు. అడపాదడపా పక్షుల కిలకిలారావాలకు మించి మరే శబ్దమూ లేదు.

మాధవికి మనసులో ఎంత దిగులుగా వున్నప్పటికీ ఆ ప్రకృతి సౌందర్యానికి పులకించిపోతూ చూడసాగింది. గాలవుడితో ప్రయాణంలో అప్పుడప్పుడూ సెలయేళ్ళను చూసినా ఇంత పెద్ద జలపాతాన్ని చూడలేదు.

"నీకు నచ్చిందా?" అడిగాడు ఉశీనరుడు నవ్వుతూ.

అవునన్నట్లు తల పంకించింది మాధవి. చక్కటి ముఖకవళికలతో, భారీ విగ్రహంతో బలిష్టంగా వున్న రాజు ఈవేళ మరింత అందంగా కనిపిస్తున్నాడు. 'ఎంత ముగ్ధమోహనంగా వున్నాడు?!' అనుకోకుండా వుండలేకపోయింది. మరుక్షణం 'ఇతణ్ణి నేను కోరుకోవడంలేదు కదా?!' అనుకుని ఉలిక్కిపడింది. వెంటనే మహారాణి, ఇతర రాణివాసపు స్త్రీలు, ఇంకా రాజు సంపర్కం పెట్టుకున్న దాసీలు కళ్ళముందు మెదిలి ఉక్రోషం ముంచుకొచ్చి 'ఛఛ.. నేను ప్రేమించడమేంటి? కాస్త అందంగా వున్నాను కనుక నాతో వుంటున్నాడు. అతడి కళ్ళలో కామం తప్ప మరేంలేదు. అనేకమందిలో నేనొకదాన్నే తప్ప తనకేం ప్రత్యేకతలేదు. తను లేకపోతే అతనికొచ్చే నష్టమేం లేదు. అసలు ప్రేమంటే ఏమిటి, అవతలి వ్యక్తిని విడిచి వుండలేని స్థితి, దగ్గరగా వుంటే మైమరచిపోవడం, దూరమైతే శూన్యంగా తోచే భావన. అలాంటి బాధ, వేదన రెండూ లేవంటే కచ్చితంగా అది ప్రేమ కానే కాదు' అనుకుంది.

ఉశీనరుడు మాధవిని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె జడపదార్థంలా మౌనంగా వుండిపోయింది.

★★★

రాజ్యంలో అందరూ యుద్ధం గురించే మాట్లాడుకుంటున్నారు. ఇక అంతఃపురం సంగతి చెప్పనవసరంలేదు.

కడుపుతో వున్న మాధవి నీరసంగా వుండి పడుకున్నప్పటికీ నిద్రపోవడంలేదు. బయట దాసీలు మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

"మన రాజు గెలవడం ఖాయం. భోజరాజు బలంలో బహుఘటికుడు. సూర్యుడి తేజస్సు, చంద్రుడి ప్రశాంతత, ఆకాశపు ఔన్నత్యం, భూమికున్నంత సహనం.." అంటోన్న దాసిని అడ్డుకుని మరొకామె "నీకు పదోన్నతి ఇవ్వాల్సిందే, మహారాణిగారికి చెప్పిచూస్తానుండు" అంది.

"ఏంటీ?" అనడిగిన మొదటామెతో "వందిమాగధిగా పనికొస్తావన్పిస్తోంది" అంది రెండో దాసి.

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

అద్భుతమైన తెలుగు తనంతో అలరారిన తెలంగాణా గ్రామసీమల కుటుంబ కథా నేపథ్యంతో మరో సీరియల్ ప్రారంభం త్వరలో...

"ఏమైనా అనుగానీ నిజంగా మనరాజు గొప్ప వీరుడు"

"ఆ.. సైనికులంతా పోరాడితే పేరుప్రఖ్యాతులు ఆయనకొస్తాయి"

"ష్.. ఊరుకో... లోపల మాధవి వుంది.. జాగ్రత్త" ఇంకో దాసి అప్రమత్తం చేసింది.

"ఆ... వింటే ఏమౌతుంది రాజుకి చెప్తుంది, అంతేకదా.. నా పెద్దకొడుకు యుద్ధంలోనే కదా చనిపోయాడు, ఈసారి సైనికుల్లో రెండోకొడుకున్నాడు... వాడికేమౌతుందోనని భయంగా వుంది. ప్రాణానికి తెగించి పోరాడే కొడుకుని తల్చుకుని బాధపడే హక్కు కూడా నాకులేదా?" ఒక దాసి బుసలుకొట్టింది.

"కేవలం నీ కొడుకులేనా, అందరివాళ్ళూ వున్నారు.. నా అన్నదమ్ములిద్దరూ సైనికులే కదా, వాళ్ళకిష్టంలేదన్నా చేర్చుకున్నారు" వెటకారంగా అంది.

"కన్నప్రేమకీ, సోదరప్రేమకీ తేడా వుంటుంది. కడుపు తెంచుకుని పుట్టిన బిడ్డ చనిపోతే ఆ దుఃఖాన్ని భరించడానికి ఈ పిడికెడుగుండె సరిపోదు"

కొడుకుల ప్రస్తావన రాగానే మాధవి మనసు చెదిరింది. 'వీళ్ళంతా కన్నకొడుకుల్ని పెంచిపెద్దచేసి ప్రయోజకుల్ని చేశారు. కానీ తనకా అదృష్టంలేదు. ఇద్దరు బిడ్డల్ని కని వాళ్ళ ముద్దుముచ్చట్లేవీ పంచుకోకుండా వచ్చేసింది. ఇప్పుడు మరో బిడ్డ కడుపులో పెరుగుతోంది. ఈసారీ జరిగేదదే' అని తల్చుకుంటే ఆమె శరీరంలో రక్తం గడ్డకడుతోంది. ఈటెలుపెట్టి పొడుస్తున్నట్లే వుంది.

దాసీజనం ఇంకా తమ సాధకబాధకాలు చెప్పుకుంటున్నారు. వాళ్ళ రక్తసంబంధీకులు, బంధువుల మరణవార్తలు, కాళ్ళూచేతులూ కోల్పోయి జీవచ్ఛవాలుగా మారిన సంగతులు వింటోన్న మాధవికి వికారం కలిగింది. 'అసలీ రాజులు యుద్ధాలెందుకు చేస్తారు? తాను గెలిస్తే ఓడినరాజు శరణు వేడుకుని కప్పం చెల్లిస్తాడు. మధ్యలో అటూఇటూ కూడా ఎందరో సైనికులు ప్రాణాలు విడుస్తారు. ఇప్పుడు ఉశీనరుడు గెలుస్తాడా? ఒకవేళ ఓడిపోతే... అలా జరిగినా బాగుండును, అప్పుడీ రాజ్యాన్ని వదిలేసి గాలవుడి కంటికి కనిపించనంత దూరం పారిపోవచ్చు. పుట్టబోయే బిడ్డనైనా ప్రేమగా పెంచుకోవచ్చు' మాధవి ఆలోచనల పరంపర అలా సాగుతుండగా "నిద్ర పోతున్నావా?" అనడిగింది ఒక దాసి లోనికి వచ్చి.

"ఉహూ, నిద్ర పట్టలేదు"

"మందు వేసుకునే వేళైంది" అంటూ ఔషధం వున్న వెండిగిన్నె చేతికి అందించింది.

మరుక్షణం రణభేరి మోగింది. వందిమాగధుల జయజయధ్వానాలు హోరెత్తేలా వినిపించాయి. "రాజుగారు అంతఃపురంలోకి వచ్చారు, రాణీగారు హారతిచ్చి, విజయతిలకం దిద్దుతారు. ఇవాళ దశమి, మంచిరోజని విజయయాత్ర ప్రారంభిస్తున్నారు. చిన్నరాణులందరూ ఒకచోట కూడారు" అంటూ విషయం వివరించింది దాసి.

'నువ్వూ వెళ్తే బాగుంటుందనే' ధ్వని ఆ మాటల్లో వున్నప్పటికీ మాధవి విని ఊరుకుంది.

దాసి అక్కణ్ణించి వెళ్ళిపోయింది. కొద్దిసేపు కోలాహలం, ఆ తర్వాత నిశ్శబ్దం. 'రాజు వెళ్ళిపోయాడన్నమాట. తాను తప్ప తక్కిన అందరూ వీడ్కోలు చెప్పేందుకు వెళ్ళుంటారు. ఆయన తాను వెళ్ళకపోవడాన్ని గుర్తించి వుంటాడా? గుర్తిస్తే వెలితిగా భావించాడా లేక కోపగించుకుని వుంటాడా? మొదటిదైతే ఇక్కడికొచ్చి తనను చూసి వెళ్ళేవాడు. అలా జరగలేదు కనుక రెండోదే అయ్యుంటుంది. కోపమొస్తే రానీ, తనకు మాత్రం రాలేదా?' అని గొణుక్కుంది.

★★★

కదనరంగంలో రాజు, ఆయన సైనికులు అరివీరభయంకరంగా పోరాడారు. రథ, గజ, తురగ, పదాతి సేనలతో శత్రుసైన్యాలను మట్టికరిపించారు. యుద్ధభూమిపై ఎటు చూసినా శవాలు, కొనూపిరితో కొట్టుమిట్టాడుతున్నవారు, కాళ్ళో చేతులో తెగి నరకయాతన అనుభవిస్తున్నవారు కనిపిస్తున్నారు. ఇక రక్తం ఏరులై ప్రవహిస్తోంది. ఆ పరిసరాలన్నీ కూడా హడలు పుట్టించడమే కాకుండా వికారం కలిగించేలా వున్నాయి. శవాల కుళ్ళువాసన, రక్తపు నీచువాసన కలగలిసి కడుపులో తిప్పుతోంది.

ఆ సాయంత్రం శత్రురాజుల గుడారాలు ప్రశాంతంగా వున్నాయి. తెల్లటి జెండా పట్టుకుని ఓ రాజదూత ఉశీనరుడి దేరా చేరాడు. రాజదూత కనుక అతణ్ణి ఎవరూ అడ్డుకోలేదు.

"మహాప్రభూ, మాహిష్మతి రాజుగారు యుద్ధాన్ని విరమిస్తున్నారు. మీతో స్నేహాన్ని కోరుకుంటున్నారు" అంటూ తల వంచి వినయంగా చెప్పాడు రాజదూత.

"మొదట కయ్యానికి కాలు దువ్వింది మేము కాదుగదా" వ్యంగ్యంగా అన్నాడు ఉశీనరుడు.

"నిజమే ప్రభూ, మేం చేసింది తప్పే. అందుగ్గానూ మాహిష్మతి రాజుగారు క్షమాపణ చెప్పుకుంటున్నారు. తమరు కనుక ఒప్పుకుంటే మా రాజుగారు కప్పం, కానుకలతో రావడానికి సిద్ధంగా వున్నారు"

ఉశీనరుడు తల పంకించాడు. ఒక నిమిషం ఆలోచించి, అవతలికెళ్ళి సేనాపతితో చర్చించి వచ్చి "నాకు మహిష్మతి రాజుగారిమీద కోపమేం లేదు. మైత్రికి ఒప్పుకుంటున్నాను, రమ్మని చెప్పండి" అన్నాడు గంభీరంగా.

రాజదూత వెళ్ళిన కొంతసేపటికి మాహిష్మతిరాజు రావడంతో ఉశీనరుడు లేచి సాదరంగా ఆహ్వానించాడు.

ఓడిపోయినందున వంగి నమస్కరిస్తున్న రాజును అడ్డుకుని "మీరు వయసులో నాకంటే చాలా పెద్దవారు, ఇలా నమస్కరించకూడదు" అన్నాడు ఉశీనరుడు స్నేహపూర్వకంగా.

దాంతో మాహిష్మతిరాజు సంతోషించి అభిమానంగా మాట్లాడాడు. ఆయన కనుసైగ చేయగా దూతలు కొన్ని పెట్టెలు తెచ్చి ఉశీనరుడి ముందుంచారు. ఆ పెట్టెల్లో నవరత్నాలు, బంగారునాణాలు, గంధపు చెక్కలు, చందనాది సుగంధ ద్రవ్యాలు, చీనిచీనాంబరాలు, ఏనుగుదంతపు పిడి వున్న కత్తులు, జింకచర్మాలు మొదలైనవున్నాయి.

వాటిని చూసి ఉశీనరుడు చాలా సంతోషించాడు.

మాహిష్మతిరాజు తన నెరిసిపోయిన గడ్డాన్ని సవరించుకుంటూ "మీరు వినే వుంటారు, నాకో కూతురుంది, పేరు మహిమ. నాకంటే వీరుడైన రాజుకిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాను... ఇన్నాళ్ళకి ఆ కోరిక తీరే రోజు వచ్చింది... మీరు నా కూతుర్ని పెళ్ళాడాలి..." అంటూ విషయాన్ని రెండుముక్కల్లో చెప్పేశాడు.

మాహిష్మతిరాజుగారమ్మాయి అందంగా వుంటుందని అంతకుముందే వినివుంటాన ఉశీనరుడు సంబరంగా తల పంకించాడు.

... ఇంకా ఉంది

ఉశీనరుడు యుద్ధవిజయంతో పాటు తన మన్మథసామ్రాజ్యానికింకో రాచకన్యను కూడా తెచ్చుకున్నాడుకదా...

మరి మాధవినేం చేస్తాడు?

యుద్ధానికెళ్లేటప్పుడు వీడ్కోలు పలికేందుకు కూడా రాని మాధవి పట్ల ఎలా మెలిగాడు?

మరో వివాహానికి సిద్ధమయిన రాజు పట్ల మహారాణి ప్రతిస్పందనేవిటి?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

డిగ్రీ చదివే రోజుల్లో... ప్రతి శనివారమూ చివరి పీరియడ్ గార్డెనింగ్ ఉండేది. 'శనివారం కాలేజీకి రావడమంటే కలర్‌ఫుల్ డ్రెస్సులు వేసుకుని రావచ్చు' అన్న ఆనందం ఒక వైపు... 'గార్డెనింగ్ చేయాల్సి ఉంటుంది' అన్న బాధ మరోవైపు మమ్మల్ని వెంటాడేవి. నేనూ కాలేజీకి డుమ్మా కొట్టాలనుకునే దాన్ని. కలర్ ఫుల్ డ్రెస్ వేసుకుని కాలేజీకొచ్చే అవకాశం దొరికేది ఆరోజే కదా... అందుకే మానేసేదాన్ని కాదు. మా కాలేజీలో ప్రతి డిపార్ట్‌మెంటుకూ విడివిడిగా గార్డెన్స్ ఉంటాయి. మాది మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్. మిగతా

మనసుకు కొత్త రెక్కలు ?!

విద్యార్థులకన్నా మా మీదే ఎక్కువ బాధ్యతుండేది. ఎందుకంటే... మాది సైన్స్ డిపార్ట్‌మెంట్ కాబట్టి.

గార్డెనింగ్... ఆ పేరు వింటేనే మాకు బోర్. 'త్వరగా వదిలేస్తే బాగుందు... ఇంటికెళ్లి చక్కగా ఎంజాయ్ చేయొచ్చు' అనిపిస్తుంది. శనివారం... మా అందరికీ

చాలా కలర్‌ఫుల్ డే. యూనిఫాం ఉండదు. రంగురంగుల డ్రెస్సులతో, చక్కగా అలంకరించుకుని కాలేజీకొచ్చేవాళ్లం. మొదటి మూడు పీరియడ్‌లు చాలా సంతోషంగా సాగేవి. చివరి పీరియడ్ వచ్చేసరికి... మా ఆనందం కాస్తా ఆవిరైపోయేది. ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చేది. అంత అందంగా తయారై కాలేజీకొచ్చిన తర్వాత ఎవరికి మట్టిలో పనిచేయాలనిపిస్తుంది చెప్పండి?. మాకైతే అస్సలు మట్టిలో చేయి పెట్టాలనిపించేది కాదు. ఒక పక్క లెక్చరర్ భయం వల్ల, మరోపక్క రిప్రజెంటేటివ్ బలవంతం వల్ల గార్డెన్‌లోకి దిగేవాళ్లం. అలాంటప్పుడే మాలో కొంత మందికి హఠాత్తుగా ఉత్తుత్తి కడుపునొప్పులు, బెబ్బెబ్బె నడుం నొప్పులొచ్చే. ఎలాగైతేనేం వారు గార్డెనింగ్ నుంచి తప్పించుకుంటారు.

ఏ సినిమాకో హాయిగా చెక్కేస్తారు. వారెంతో అదృష్టవంతులని మేం అనుకునేవాళ్లం. వారిపై చాలా అసూయపడేవాళ్లం. కొందరైతే... బలవంతంగా బరిలోకి దిగినా... తాము ఆదివారం చేయబోయే కార్యక్రమాలను, స్నేహితులతో గడపబోయే క్షణాల గురించి ఊహిస్తూ, కలలుకంటూ ఉండేవారు. లెక్చరర్ అటువైపు వచ్చినప్పుడు పనిచేస్తున్నట్లు నటించేవారు. మరి కొందరైతే ప్రతి శనివారమూ కాలేజీ ఎగ్గొట్టేవారు.

మాకు ఎన్ఎస్ఎస్ క్యాంపులుండేవి. దీనిలో భాగంగా మా లెక్చరర్లు

మమ్మల్ని పల్లెటూర్లకు తీసుకెళ్లేవారు. అక్కడా గార్డెనింగ్ తప్పింది కాదు. మా లెక్చరర్లు ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వాహకులు, మా చేత రాలిపోయిన ఆకులన్నీ తీయించేవారు. స్థలాన్నంతా శుభ్రం చేయించేవారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రకరకాల పూల మొక్కలు, ఆర్చివ్, క్రోటన్ మొక్కలను సేకరించేవాళ్లం. వాటన్నింటినీ జాగ్రత్తగా తీసుకొచ్చి మా క్యాంపస్‌లో పాతేవాళ్లం. పాత మొక్కలకు నీరుపట్టి, కొత్త మొక్కలు నాటేవాళ్లం.

ఇలా మా లెక్చరర్లు అప్పజెప్పిన పనిని బలవంతంగా చేసేవాళ్లం. వారిని తిట్టుకుంటూ, మమ్మల్ని మేం జాలిగా చూసుకుంటూ... చివరికి ఎలాగోలా గార్డెనింగ్ పూర్తి చేసేవాళ్లం. మా దాడికి బలైపోయిన లెక్చరర్లు ఎంతో మంది ఉన్నారు. మా డిపార్ట్‌మెంట్‌లో లేడీ లెక్చరర్స్ ఉండేవారు. ఫలితంగా మేం ఇంకా ఎక్కువగా అవస్థ పడేవాళ్లం. గార్డెనింగ్ నుంచి తప్పించుకోవడానికి వీలుండేదే కాదు. 'ఒప్పుకున్నాక తప్పుతుందా' అని విసుక్కుంటూ, సణుక్కుంటూ చేసేవాళ్లం. క్లాసులో ఉన్న విద్యార్థులంతా... అబ్బాయిలూ, అమ్మాయిలూ అన్న తేడా లేకుండా కలిసి పనిచేసేవాళ్లం.

కొన్ని రోజులకు...

మేం నాటిన మొక్కలకు విచ్చుకున్న పువ్వులను చూసేసరికి మా మనస్సుకు కొత్త రెక్కలొచ్చేవి. ఎంతసేపైనా వాటినలాగే చూడాలనిపించేది. ఖాళీ సమయంలో వాటిని చూసుకుంటూ... ఎంతో ఆనందపడేవాళ్లం. చూస్తుండగానే కాలం వేగంగా సాగిపోయింది. కాలేజీ రోజులు గడిచిపోయాయి. ఇప్పుడు మేం గార్డెనింగ్ చేయాలనుకున్నా... ఆ గార్డెన్స్ లేవు, ఆ లెక్చరర్స్ లేరు... అప్పటి స్నేహితులు అంతకన్నా లేరు.

సో డీయర్ యంగ్ పార్ట్‌నర్స్... ఇలాంటి గార్డెనింగ్ మీరూ చేయాల్సొస్తే... మేం చేసినట్లు కాకుండా ఎంజాయ్ చేస్తూ... పూర్తి బాధ్యతతో చేయండి. మీ కాలేజీ జ్ఞాపకాల ఆల్బమ్‌లో వాటికి స్థానం కల్పించండి. మరి...చేస్తారు కదూ.

టి. హిమబిందు, ఎంఎస్సీ, నెల్లూరు

ఫ్రెండ్స్... మీరూ కాంపస్‌ఛాట్‌లో మీ కాలేజీ అనుభవాలను స్నేహకు రాసి పంపండి. వాటితోపాటు మీ ఫోటోనూ జతచేయడం మరువకండి.

చిన్నతెర... పెద్దతెర... ఎక్కడైనా నటన ఒక్కటే

చందు



ఈ సినిమాప్రపంచం విచిత్రమైనది. ఇది ఎవరిని ముంచుతుందో ఎవరినీ గట్టెక్కిస్తుందో తెలియదు. ఎవరిని విలువలతో ఉండనిస్తుందో ఎవరిని ఉండనివ్వదో కూడా చెప్పలేం. అలాంటి తళుకులీను సినీలోకాన రావికొండలరావు తనకంటూ ఉన్న పద్ధతుల్ని, క్రమశిక్షణను, కష్టపడేతత్వాన్ని నిలబెట్టుకుంటూనే తనకే లోటు రాకుండా మనగలిగిన యాక్టర్, దర్శకుడు, రచయిత, ప్రొడక్షన్ నిర్వాహకుడు రావికొండలరావు. వారి అనుభవాలనూ, అనుభూతుల్ని తెలుసుకుందాం.

సినిమా పుట్టిన తొలి రోజుల్లో నాటకాలకే సినిమాలుగా తీశారు. నాటకాలు వేసిన నటీనటులందరూ సినిమా నటులయ్యారు. ఆ కాలంలో సినిమా యాక్టర్లంటూ వేరే ఎవరూ లేరు. వాళ్ళకి అందచందాలున్నాయా...లేదా? కృష్ణుడి వేషానికి పనికొస్తాడా...లేదా అనేది లేదు. పద్యం బాగా చదవగలడా? పాట బాగా పాడగలడా? అన్నవే సినిమాలో నటించడానికి ప్రధాన అర్హతలుగా ఉండేవి. ఈ నేపథ్యంతో రంగస్థల కళాకారులందరూ సినిమా నటులయ్యారు. తర్వాత రోజుల్లో అర్హతలుగా ఉన్న పాట, పద్యం పోయి అందం, పర్సనాలిటీతో పాటు స్టేజ్ అనుభవం చూసుకునేవాళ్ళు. ఇంకా రాను రాను వెళ్లేసరికి తెలుగు కూడా రానక్కర్లేదు. డబ్బింగ్ వచ్చేసింది. క్లోజప్ సన్నివేశాల్లో ఫైట్స్ చేస్తే మిగతాది డూప్ సహాయంతో చిత్రీకరిస్తారు. అందం, పర్సనాలిటీ లేకపోయినా పర్వాలేదన్న చందాన నేడు ఎవరైనా హీరోలై పోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే కొంతకాలానికి యాక్టింగ్ చచ్చిపోతుందేమోనన్న భయం ఉంది.

తొలి బుల్లితెర అనుభవం

1974లో మద్రాసులో బ్లాక్ అండ్ వైట్‌గా బుల్లితెర ప్రసారాలు మొదలయ్యాయి. ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలపాటు కార్యక్రమాలు ప్రసారమయ్యేవి. వారానికొకసారి సినిమా పాటలు వేసేవారు. రెండేళ్ళు గడిచిన తర్వాత వారానికొక రోజు అరగంట సేపు తెలుగు కార్యక్రమాలు ప్రసారం చేయడం ప్రారంభించారు. అప్పుడు నన్ను పిలిచి అరగంట వచ్చేలా ఒక నాటిక వేయమన్నారు. నేను రాసిన 'కలిసి ఉండాలి' అనే నాటిక వేద్దామనుకున్నాను. టీవీ షూటింగ్ కూడా సినిమాలాగే ఉంటుందనుకున్నాను. మూడు కెమెరాలు పెట్టి ఒకేసారి షూట్ చేస్తారన్న సంగతి అక్కడికి వెళ్ళిన తర్వాత తెలిసింది. టీవీకి ఎడిటింగ్ ఉండదన్నారు. సినిమాలాగా షాట్ బై షాట్ తీస్తారనుకున్నాం. రిహార్సల్స్ వేయలేదు కనుక ఒకరోజు టైం అడిగాం. నాటికలో ముగ్గురే ఆర్టిస్టులు. నేను, మా ఆవిడ, పొట్టి ప్రసాద్. మర్నాడు వెళ్ళాం... నాటికలో ఎక్కడ తప్పొచ్చినా మొదటి నుంచీ మొదలుపెట్టాలన్నారు. దీంతో ఏ తప్పు పడకుండా ఏకధాటిగా చెప్పగలమా? లేదా? అన్న భయం పట్టుకుంది. నాటిక ఆడడం స్టార్ట్ చేశాం. చివర్లో పొట్టి ప్రసాద్ క్యారెక్టర్ వస్తుంది. రెండు డైలాగ్స్ చెప్పాక మూడో డైలాగ్ ఫట్‌మని ఆగిపోయింది. ''బాబూ జాగ్రత్తరా... ఇదెక్కడి గొడవరా'' అంటూ మళ్ళీ ముందు నుంచి వచ్చి నాటకాన్ని పూర్తి చేశాం. ఇది నా మొదటి టీవీ అనుభవం. రంగ స్థలంపై బాగా ఆడిన నాటిక కాబట్టి తప్పు పడదనిపించింది. ఆ తర్వాత కొన్ని నాటకాలు వేయగలిగాం అనుకోండి.

ఏదైనా నటన ఒకటే

సినిమాలో నటించినా... టీవీలో నటించినా... నటన ఒకటే. సినిమాకి అడిగినంత(రెన్యుమరేషన్) టీవీకి అడగొద్దంటారు. టీవీకని తక్కువ నటన ఉండదు కదా! టీవీ రంగం బాగా విజృంభించడంతో సినిమాలను చూసేవాళ్ళు బాగా తగ్గిపోయారు. ఇప్పుడొస్తున్న సినిమాలు బాగుండకపోవడం కూడా మరో కారణం అనుకోండి. టీవీల్లో రోజుకి 38 సీరియల్స్ వస్తున్నాయి. ఇన్ని సీరియల్స్ ప్రసారమవుతున్నప్పుడు ఏదో ఒకటి నచ్చుతుంది. లేదంటే ఏదో ఒక సినిమా చూస్తూ కూర్చుంటారు. దీంతో సినిమా థియేటర్‌కి వెళ్ళాల్సిన అవసరం ఏముంది? టీవీలో వచ్చే కార్యక్రమాలకంటే మించింది ఏమన్నా సినిమాలో ఉంటే థియేటర్‌కి వెళతారు. లేకపోతే లేదు.

గోల... శబ్దం... తప్ప మెలోడీ లేదు

అప్పటికీ ఇప్పటికీ టెక్నికల్‌గా స్థాయి పెరిగింది. ఆరోజుల్లో పాట రికార్డింగ్ చేయాలంటే రెండు మైకులుండేవి. వాటిలోనే అందరూ కలసి పాడాలి. ఇప్పుడా పద్ధతి లేదు. వీలున్నప్పుడు గాయకుడొచ్చి పాడి వెళ్ళిపోతాడు. టైం ఉన్నప్పుడు గాయని వచ్చి పాడుతుంది. ఏదైనా ఒక పరికరం అందుబాటులో లేకపోతే వీలుచూసుకుని వచ్చి కీ...కీ... అని వాయించి వెళ్ళిపోవచ్చు. వీటన్నింటినీ తర్వాత మిక్స్ చేస్తారు. ఈ మిక్సింగ్ వలనో ఏమిటో ఏ పాటకీ క్లారిటీ ఉండదు. గోల... శబ్దం... తప్ప మెలోడీ లేదు. ఆనాటి తరం పాటలన్నీ మెలోడియస్‌గా ఉంటాయి. ఆ రోజుల్లో ఉన్న పద్ధతే సరైందా అని ఒక్కోసారి అనిపిస్తుంది. టెక్నాలజీ పెరిగినా క్వాలిటీ ప్రకారం కిందికి దిగజారుతున్నామన్న విచారం మాత్రం ఉంది. ☆

(రావికొండలరావు గారు చెప్పే విశేషాలు వచ్చేవారం కూడా)

చిన్నారి చిత్రకారులు

కె.నవీన్ చంద్ర,
3వ తరగతి,
జెవిఎన్ ఇంగ్లీష్ హైస్కూల్,
జవహర్‌నగర్,
హైదరాబాద్.



రాహుల్,
4వ తరగతి,
సెయింట్ మేరి స్కూల్,
కూకట్‌పల్లి,
హైదరాబాద్.

భవనాన్ని చేరేదెలాగో



మేం చెప్పిన రంగులెయ్యండే



1.బ్లూ 2.గ్రీన్ 3.ఎల్లో 4.బ్రౌన్ 5.రెడ్

మొత్తం పిల్లులెన్ని?

ఎనిమిది తేడాలేవబ్బా!



వేస్తాలూ... అప్పడే క్రిస్మస్ మాసం వచ్చేసింది. అందుకే మీకు ఈ వారం తేడాల్లో ఈ బొమ్మలు తీసుకొచ్చాం.

ఇక్కడ రెండు బొమ్మలున్నాయికదా.



వాటిల్లో సరిగ్గా ఎనిమిది తేడాలున్నాయి. అవి ఎక్కడ వున్నాయో కనుక్కోవాల్సింది మాత్రం మీరే. మరి పెన్నో పెన్సిలో తీసుకుని చకచకా గుర్తించండి.

20.11.05కు సరైన సమాధానాలు రాసినవారు

కె.ఉపేంద్ర యాదవ్ (10), షేర్ మహ్మద్ పేట, కృష్ణా. హఫ్సా నయీమ్ (6), ఎస్.ఎఫ్.ఎస్.స్కూల్, కోరుట్ల, కరీంనగర్. కె.మనోజ్ రాహుల్ (9), శ్రీ వాణి కాన్వెంట్ అండ్ హైస్కూల్, మాలికిపురం, తూ.గో. ఎన్.సాయిపవన్ (8), జడ్‌పిహెచ్‌స్కూల్, మొగళ్లూరు, ప్రకాశం.తర్లపాటి సాంబశివరావు (6), బోయపాటి రవికాంత్ (7), జడ్‌పిహెచ్‌స్కూల్, వేల్పూరు, గుంటూరు. బి.రామకృష్ణ, తనకంపాడు, ఖమ్మం. వి.జ్యోతి (8), ఆనందనిలయం (బాలికల వసతిగృహము), విజయనగరం. ఎ.సాహిత్య లోహిత (4), ఎ.శరత్ చంద్ర (2), పాలకొల్లు. ఎం.రాజశేఖర్ (10), జడ్‌ఎస్‌ఎస్‌స్కూల్, తల్లాడ, ఖమ్మం. కూనిరెడ్డి కృష్ణారెడ్డి (10), వికాస్ రెసిడెన్షియల్ స్కూల్, గురజాల. మాదాల సింగరకొండ (7), జడ్‌పిహెచ్‌స్కూల్, వేల్పూరు, గుంటూరు. ఎం.రుద్రేష్ (4), ఊరుపేరు రాయలేదు. రాళ్లబండి సౌందర్య (8), విశ్వశాంతి హైస్కూల్, శ్రీరాంపూర్. ఎం.శిరీష (10), గోల్డెన్‌బెల్స్‌స్కూల్, కళ్యాణదుర్గం. పి.దివ్య (3), సరిత (8), ఎస్.రవళి (4), ఎస్.సంధ్య (4), ఎస్.కార్తీక్ కుమార్ గౌడ్, భగత్‌సింగ్ నగర్, వనపర్తి. ఎస్‌కె.కాశిం షైదా, ఎస్‌కె.రిజ్వానా (10), వికాస్ రెసిడెన్షియల్ స్కూల్, గురజాల.ఎం.దుర్గా సృజన (9), సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్, పోలవరం, ప.గో. ఎన్.శ్రావణ్ కుమార్, వినుకొండ, గుంటూరు. పి.నిహారిక (6), హిందూపూర్. ఎం.ఉదయ్ కుమార్ (10), ఎస్‌సిహాస్టల్, చన్నపొర్ల. శ్రీ వశిష్ట (9), మోడ్రన్ హైస్కూల్, చిలకలూరిపేట, గుంటూరు. టి.వి.ఎల్.నాయక్, శ్రీ వాణి విద్యాలయం, జనగాం, వరంగల్. జి.ప్రదీప్ (9), జడ్‌పిహెచ్‌స్కూల్, దేవరకొండ. జి.సాయిభరత్‌రెడ్డి (7), మోదుకూరు, గుంటూరు. కె.శ్రీతన్మయ (3), బ్రాడీపేట, గుంటూరు. పాపసాని సురేష్‌బాబు (8), జడ్‌పిహెచ్‌స్కూల్, వేల్పూరు, గుంటూరు. ఎస్‌కె.సలామ్ (7), కార్ఖానా అరీఫ్ (7), ఎంపియుపి స్కూల్, వినుకొండ, గుంటూరు. సిహెచ్.సుమన్‌కుమార్ (5), మండల ప్రాథమిక పాఠశాల, మొగళ్లూరు. ఎ.అనిల్ కుమార్ (7), పి.రేవంత్ (7), సిఎస్ఐ మిషన్ హైస్కూల్, ఏటూరునాగారం, వరంగల్. మాచర్ల సాగర్‌బాబు (9), నాజర్‌పేట, గుంటూరు. చెరుకుంపాలెం నజార్‌ఖాన్ (4), రవి పబ్లిక్‌స్కూల్, వినుకొండ. దండు కరీమ్ (7), ఎంపియుపి స్కూల్, వినుకొండ, గుంటూరు. వనమాడి రాజు (10), కొమ్మారెడ్డి పబ్లిక్ స్కూల్, బంటుమిల్లి. కె.కిశోర్, నల్లగొండ. కె.మణిదీప్ (9), జిహెచ్‌స్కూల్, టంగుటూరు, ప్రకాశం. జి.అరవింద్ (6), జడ్‌పిహెచ్‌స్కూల్, ఉయ్యూరు. ఎన్.శ్రీలక్ష్మి (4), ఎన్.ప్రేమి (4), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎన్.అంజనీదేవి (7), ఎన్.సాయిపవన్ (8), జడ్‌పిహెచ్‌స్కూల్, మొగళ్లూరు, కనిగిరి. పి.కృష్ణ సత్యప్రియ (4), డాన్‌బాస్కో హైస్కూల్, పి.వినీత (7), శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్, వెంకటేశ్వరపురం, నెల్లూరు. ఎన్.అమూల్య (5), సీతారామ్‌నగర్, కొత్తగాజువాక. ఎం.శ్రీశ్రీ జయసూర్యచంద్రుడు (5), లాలాగూడ, సికింద్రాబాదు. సిహెచ్ చిలమకూరి దిలీప్‌రెడ్డి (10), వికాస్ రెసిడెన్షియల్ స్కూల్, గురజాల. జి.గోపిసాయిరామ్ (8), ఉషాకిరణ్ హైస్కూల్, ఉయ్యూరు. ముంద్రు మనోహర్ (7), జడ్‌పిహెచ్ స్కూల్, వేల్పూరు, గుంటూరు. సిహెచ్.నశింఖాన్ (7), ఎంపియుపి స్కూల్, వినుకొండ, గుంటూరు. యస్.అమర్‌నాథ, యస్. కీర్తిశ్రీ (6), ఎస్‌విఎస్‌ఎంఇఎంస్కూల్, మదనపల్లి. డి.కిరణ్‌బాబు(10), తల్లాడ, ఖమ్మం. నల్లగొండ లక్ష్మణ్ (10), యేసు హృదయ హైస్కూల్, తల్లాడ, ఖమ్మం. జి.అరవింద్ స్వామి రామ్(6), ఉయ్యూరు. కె.కవిత (9), యు.లక్ష్మణ్ కుమార్ (8), ఇ.ఉదయ్‌కుమార్ (8), బి.కుశకుమార్ (8), యం.అమరేష్ (10), *బాబు నరేంద్రప్రసాద్, (8), కె.విజయ్ కుమార్, (10), బి.రవితేజయాదవ్, (10), ఎస్. కవీంద్ర, (10), యు.ఎస్ అనిల్, (10), నరసింహులు, (10), షబ్బీర్ హుస్సేన్, (10), యు.ఈరన్న, (10), ఆర్.రంజాన్, (10), యు.ఎం అనిల్, (10), యం ప్రసాద్, (10), యు రాజశేఖర్, (10), యం.అనుదీప్, (10), జి నాగేష్, (10), కె.యం యసీన్, (10), జి విజయ్ ప్రకాశ్, (10), యం. తిమ్మప్ప, (10), యు. నాసీర్, (10), యం రాజేశ్, (10), బి.శ్రీనివాసులు, (10), శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. కె.చరిత (6), సెయింట్ పోయిస్ గరల్స్ టెన్త్ హైస్కూల్, రామ్‌నగర్, హైదరాబాదు.*

పలివీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో చెప్పకోండి చూద్దాం. అరె... మీరు చెప్పేది రైటే. అందుకే మీరు వెంటనే ఏం చేయాలంటే... ఒక పోస్టు కార్డు తీసుకుని దాని మీద సమాధానం రాయండి. తర్వాత మాకు పోస్ట్ చెయ్యండి.

మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

27.11.05 సమాధానం: ఏంగెల్స్

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

మన పొలానికీ, మనం నాటిన చెట్టుకీ రక్షణగా కంచెల్లాంటివి పెట్టుకుంటాం. మన పిల్లా పాపలతో కాపురముంటున్న మన ఇంటికి ఏ ఆపదా రాకుండా చూసుకుంటాం. మనది అనుకున్నదాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటాం. అలాంటిదే మన దేశంపట్ల కూడా ఉంటుందికదా! మన దేశాన్ని అన్నిరకాలుగా కాపాడ్డానికి రకరకాల సైన్యాలున్నాయి. పదాతిదళాన్ని ఆర్మీ అని, వైమానిక దళాన్ని ఎయిర్‌ఫోర్స్ అని, నౌకాదళాన్ని నేవీ ఫోర్స్ అని అంటారు. ఆ నౌకాదళ దినోత్సవం ప్రతీ ఏడాదీ డిసెంబర్ 4వ తేదీన జరుపుతారు.



సాగర తీర రక్షణలో భారత నావికాదళం

మన దేశానికి మూడు వైపుల సముద్రం, ఒక పక్క భూభాగం ఉంది. అందుకే భారతదేశం వాణిజ్యవర్తకాలకు అనువైనదిగా ప్రపంచదేశాలు గుర్తించటంతో సముద్ర వాణిజ్యానికి బీజం పడింది. ఈ సముద్రమార్గం ద్వారా శత్రువులు మనపై దండెత్తకుండా రక్షణ కల్పించుకోవలసిన ఆవశ్యకతను కూడా గుర్తించారు. ఏ దేశానికైనా తన ఒడ్డు నుంచి సముద్రంలో 12 నాటికల్ మైళ్లు లోతు వరకు (24 కి.మీ దూరం) ఆ దేశపు సరిహద్దు. 200 నాటికల్ మైళ్లలోతు వరకు ఆర్థికపరమైన హక్కులుంటాయి. సముద్రాలలో సరిహద్దు తీరంపై మన అజమాయిషీ మాత్రమే కొనసాగాలన్న ఆలోచనలకు అనుగుణంగా భారత నావికాదళం ఏర్పడింది. తీరప్రాంతాల రక్షణకు విశాఖపట్నం, ముంబయి, కొచ్చిన్ ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. సముద్రమార్గాల ద్వారా శత్రుసేనల దాడులను ఎదుర్కొనటానికి ఎన్నో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఏడువేల కిలోమీటర్ల సముద్ర తీరం, 20 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కాపాడవలసిన బాధ్యత భారత నావికాదళం భుజస్కంధాలపై ఉంది. ఇంతే కాకుండా సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న పెద్ద నౌకాశ్రయాలు, మూడు వందల చిన్న నౌకాశ్రయాలు, సీడెడ్ మైనింగ్ సైట్సు, చమురుబావులు వంటి వాటిని ఈ నౌకాదళం పరిరక్షించవలసి ఉంది. భారతదేశం ద్వారా జరుగుతున్న ఎగుమతి దిగుమతులు సముద్ర రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అంతేకాదు...భారతనౌకాదళం ఆధ్వర్యంలో అండమాన్, నికోబార్ వంటి 866 చిన్న దీవులను కూడా చూడవలసిన బాధ్యత కూడా ఉంది.

ఆ డిశెంబర్ నాలుగు...

అది 1971 డిశెంబర్ 4వ తేదీ...భయంకరమైన చలి. అంతకు మించి పాకిస్తాన్‌తో భీకర పోరు. నువ్వా నేనా అన్న తీరులో మంచు కురుస్తున్నా...భారత నావికాదళంవారి కణతలపక్కనుంచి చెమటధారలు. అప్పుడు అర్థరాత్రి 11గం॥ 45 ని॥. మన యుద్ధనౌక కరాచీ హార్బర్‌కి 12 కి మీ దూరంలో పొంచివుంది. కెప్టెన్ (ఎఫ్) 15 ఎఫ్ఎస్ క్షిపణినౌకలు కరాచీ హార్బర్‌కు గురిపెట్టాయి. పేలిన క్షిపణులు భారత విజయకేతనాన్ని ఎగురవేశాయి. ఆ విజయానికి గుర్తుగా ప్రతి డిశెంబర్ 4వ తేదీ భారత నావికాదళ దినోత్సవమయ్యింది.

...నావికాదళమేర్పడిందిలాగన్న మాట!

భారతదేశాన్ని ఆంగ్లేయులు పరిపాలించిన సమయంలో నావికాదళం ఏర్పాటు విషయంలో అంతగా శ్రద్ధ చూపించలేదు. వాళ్లకేం పని చెప్పండి? అయితే వాళ్ల కాలంలోనూ తప్పనిసరి అయి కొన్ని ఏర్పాట్లు జరిగాయని చెప్పవచ్చు. 1612 సెప్టెంబరు 5న భారతదేశంలోకి బ్రిటిష్ యుద్ధ నౌకాదళాలు వచ్చాయి. ఆ దళాలే ఈస్ట్ ఇండియా కంపెనీ వారు ఇండియన్ మెరైన్‌గా ఏర్పడ్డాయి. 1686లో ఆ ఇండియన్ మెరైన్ ప్రధాన స్థావరం బొంబాయికి మారింది. 1830లో అది ఇండియన్ నేవిగా మార్పు చెందింది. 1858లో హర్‌మెజిస్టీ ఇండియన్ నేవిగా ఏర్పడింది. మొట్ట మొదటి భారతీయుడు ల్యూటినెంట్ డి.ఎన్. ముఖర్జీ 1928 జనవరి 26న నియమితులయ్యారు. ఆ తర్వాతే "భారత నావికాదళం" ఏర్పాటు అయింది. ఆరేళ్ల తర్వాత రాయల్ ఇండియన్ నేవిగా పేరు మార్చారు. అదన్నమాట సంగతి!

ఇతర దేశాలతో కయ్యం వచ్చే సమయంలో మన దేశానికి పటిష్టవంతమైన రక్షణ వ్యవస్థ ఉండాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. అందులో భాగంగా 1947లో ఆరువేల మంది నావికాదళాధికారులు, సిబ్బందితో ఉన్న ఈ వ్యవస్థ 1956లో "ఐ.ఎన్.ఎస్ ఢిల్లీ", 1959లో "ఐ.ఎన్.ఎస్. మైసూర్" వంటి భారీ నౌకలను సమకూర్చుకుంది. ఆ తర్వాత "ఐ.ఎన్.ఎస్. విక్రాంత్", "విరాట్"లను ఏర్పాటు చేసింది. 1989లో రక్షణరంగంలో నావికాదళానికి కేటాయించిన బడ్జెట్ కూడా పెరిగింది.

వారేవ్వా...భారత నౌకా దళం!

మూడు విధాలైన ఆయుధబల సంపత్తితో మన భారత నావికా దళం మొత్తం ప్రపంచ నావికాదళశక్తిలోకే ఐదవస్థానంలో ఉంది. మన నావికాదళానికి ప్రస్తుతం 125 యుద్ధనౌకలున్నాయి. రాబోయే ఇరవై సంవత్సరాల్లో ఆ సంఖ్యను 200లకు పెంచాలని ప్రభుత్వం



ఆలోచన చేస్తోంది. మైన్‌స్వీపర్లు, ఫ్రిగేట్లు, డెస్ట్రాయిర్లు, ఎయిర్‌క్రాఫ్టు క్యారియర్లు వంటివి మన రక్షణదళంలో ఉన్నాయి. వీటిలో కొన్నింటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ చాలావాటిని మనదేశ సాంకేతిక సామర్థ్యంతో తయారుచేశారు. ఉపరితల నౌకా పరిశోధన, అభివృద్ధి, లాజిస్టిక్ సపోర్టు వంటివన్నీ మన నౌకాదళ వ్యవస్థ సొంతంగా సమ కూర్చుకోగలిగింది. ఎయిర్ క్రాఫ్టులలో అత్యంత ఆధునికమైనవిగా భావిస్తున్న సీ హారియర్ ఎయిర్‌క్రాఫ్టు, సీకింగ్ ఎంకె 42బి, వెర్టికల్ టేకాఫ్ అండ్ లాండింగ్ (వి.టి.బి.ఎల్) హెలికాప్టర్లను కూడా భారత నావికాదళమే తయారు చేసుకుంటోంది. ప్రస్తుతం గ్యాసు, టర్బయిన్‌లతో నడిచే యుద్ధనౌకలు తేలికగా ఉంటాయి. ఆయుధాలు, ఎలక్ట్రానిక్ సిస్టం కూడా చాలా మారిపోయింది. కంప్యూటరైజ్డ్ యాక్షన్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ ద్వారా పనిచేయటం వల్ల ఆధునికతను సంతరించుకుంటున్నాయి.



నావికాదళం ఆధ్వర్యంలోని యుద్ధనౌకలు సైపిడాల్ ద్వారా ఎన్.బి.సి. ఎటాక్‌ను ఎదిరించి తమ లక్ష్యాలను చేరుకుంటాయి. పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా నౌకల నిర్మాణాన్ని చేపడుతున్నారు. సముద్రమార్గాల ద్వారా జరుగుతున్న బంగారం, మాదక ద్రవ్యాల రవాణాను కూడా అడ్డుకోవటానికి కోస్టుగార్డు సేవల్ని ఉపయోగించుకుంటున్నారు.

ఇలా చేస్తే ఎలా చెప్పండి?

గడచిన నాలుగేళ్లలో నౌకాశ్రయాలలో యుద్ధనౌకల నిర్మాణం సరిగ్గా జరగటం లేదు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవచ్చునన్న ధీమాతో ప్రభుత్వం ఉంది. సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవటానికి ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదు. 1964లో సిబ్బంది ఏమేర ఉండాలో చేసిన నిర్ణయాన్ని సమీక్షించే ప్రయత్నాలు కూడా ఇంత వరకూ జరుగలేదు. అంతే కాకుండా ఆధునీకరణ పట్ల కూడా తగినంత శ్రద్ధ చూపించటంలేదు. నౌకాదళం నుంచి కోస్టుగార్డు విభాగాన్ని వేరుచేసింది. ఐ.ఎన్.ఎస్. విక్రాంత్ నౌకలు పాతవయిపోయినప్పటికీ మరమ్మతులు చేస్తున్నారు తప్ప కొత్తదాని రూపకల్పన చేయట్లేదు.

చుట్టూ సమస్యల సుడిగుండాలే...

భారతదేశానికి మూడువైపులా సముద్రం ఉండడంతో సముద్రం ద్వారా ప్రమాదాలు పొంచివున్నాయి. హిందూ మహాసముద్రం భారతదేశానికి మాత్రమే సొంతం కాదని కొన్ని అగ్రరాజ్యాలు రంకెలు వేస్తున్నాయి. ఈశాన్య ప్రాంతంలో లయోనింగులోనూ, గంగడంగ్ ప్రాంతంలో పాంగై, జింజియంగ్‌లలోనూ కొత్త స్థావరాలు ఏర్పాటు కావటంతో నౌకాదళం అప్రమత్తంగా ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అత్యంత పొడవైన సముద్రతీరం, పటిష్టమైన నౌకాయానం ఉన్నప్పటికీ నౌకావాణిజ్యం మాత్రం అనుకున్న విధంగా పెరగటం లేదు. వాణిజ్య నౌకలకు తగిన రక్షణా, అవసరమైన సదుపాయాలూ కల్పించటం లేదు. మలక్కా, హర్‌ముజ్ తదితర ప్రాంతాలకు వెళ్లే నౌకలకు ఎస్కార్ట్ కలిగించటం కూడా కుదరటం లేదు. హిందూ మహాసముద్రంలో ఒకటిన్నర కోట్ల టన్నుల మత్స్య సంపద ఉన్నప్పటికి వాటిని పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నాం. హిందూ మహాసముద్రంలో మాంగనీసు, కోబాల్టు, రాగి, నికెల్ వంటి ఖనిజాలు ఉన్నప్పటికీ వాటికి బైటికి తీయలేకపోతున్నాం. అణుశక్తితో నడిచే జలాంతర్గాముల విషయంలో మనం పూర్తిగా వెనుకబడిపోయాం. సోవియట్ యూనియన్ "చక్ర" అనే జలాంతర్గామిని భారతదేశానికి అద్దెకు ఇచ్చింది. ఆ తర్వాత సోవియట్ విచ్ఛిన్నం కావటంతో 1991 జనవరిలో చక్రను తిరిగి తీసుకుంది.

అదిగో అల్లదిగో మన విశాఖ నావికాదళం

దేశరక్షణలో కీలకపాత్ర వహిస్తున్న తూర్పు నావికాదళం అలుపెరుగని ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. మన రాష్ట్రంలో విశాఖపట్నం కేంద్రంగా ఇది పనిచేస్తోంది.

ఆర్ఐఎన్ఎస్‌గా ఆవిర్భావం

రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు.. 1939 డిసెంబర్ 12న విశాఖలో చిన్న కార్యాలయాన్ని.. ఆర్ఐఎన్ఎస్ సర్కార్స్‌గా రాయల్ ఇండియన్ నేవీ ప్రారంభించింది. దేశ రక్షణలో తూర్పు నౌకాదళానిది కీలక పాత్ర. బంగాళాఖాతం, మలక్కా ప్రాంతంలోని కొన్ని భాగాలు, హిందూ మహాసముద్రంలోని కొంత భాగంలో తూర్పు నౌకాదళం రక్షణ బాధ్యతలు నిర్వహిస్తోంది. తూర్పు తీరం పొడవు 2,600 కిలోమీటర్లు. ప్రత్యేక వాణిజ్య ప్రాంతం 1.3 మిలియన్ చదరపు కిలోమీటర్లు. ఈ భాగంలో సర్వ హక్కులూ మనదేశానివే. దేశ రక్షణతోపాటు పోర్టులు, హార్బర్లు, ఆయిల్ ప్లాట్‌ఫారాలు, ప్రత్యేక వాణిజ్య ప్రాంతంలోని ఆస్తుల పరిరక్షణ బాధ్యతను కూడా తూర్పు నౌకాదళం నిర్వహిస్తోంది.

మన దేశానికి తూర్పున ఉన్న సముద్ర జలాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తూర్పున ఉన్న మలక్కా ద్వారం నుంచి పెద్ద ఎత్తున నౌకా రవాణా జరుగుతోంది. మలక్కా ద్వారం మలేషియా, ఇండోనేషియాలకు మధ్యన ఉంది. రోజు సుమారు 200 నౌకలు మలక్కా ద్వారం నుంచి ప్రయాణం సాగిస్తున్నాయి. వివిధ రకాల సరుకులతోపాటు 10 మిలియన్ బ్యారళ్ల క్రూడ్ ఆయిల్ కూడా మలక్కా ద్వారం నుంచి రవాణా అవుతోంది. ప్రపంచంలో రద్దీగా ఉండే నౌకా రవాణా మార్గాల్లో ఇదొకటి.

రక్షణ రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఈ నావికాదళం తూర్పుతీర సముద్రంలో రక్షణ కవచంగా ఉంటోంది.

1931 డిసెంబరు 12న ఐ.ఎన్.ఎస్. సర్కార్స్ పేరిట చిన్న నేవల్ యూనిట్ ప్రారంభమైంది. భారత ప్రభుత్వ సూచనల మేరకు 1960లో సదరన్ నేవల్ కమాండ్, 1967లో ఈస్టర్న్ నేవల్ కమాండ్ అనే రెండు విభాగాలుగా ఏర్పడింది. తూర్పు నావికాదళాన్ని పటిష్టపరచటానికి 1971 మే 19న ఐ.ఎన్.ఎస్. "వీరబాహు"ను ప్రారంభించారు. ఆ తర్వాత 1974లో "ఐ.ఎన్.ఎస్. శాతవాహన బేస్"ను నెలకొల్పారు. ఇది సబ్‌మెరైన్ల నిర్వహణలో శిక్షణ ఇచ్చే కేంద్రంగా మంచి పేరొచ్చింది. ఆ సమయంలో ఈ శాతవాహనలో పెట్యా, కల్వరి, రిస్క్‌వెసెల్, పెట్రోబోటు, లాండింగ్‌షిప్ వంటి జలాంతర్గాముల్లో పనిచేసే వారికి శిక్షణ అందించారు. 1987 నాటికి ఈ బేస్‌లో మరే ఇతర కార్యక్రమాలూ చేపట్టకుండా కేవలం శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకే పరిమితం చేశారు.

ఆ తర్వాత తూర్పు నావికాదళం అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. 1981లో ఐ.ఎన్.ఎస్. డేగా, 1985లో ఐ.ఎన్.ఎస్. కళింగ ప్రారంభమయ్యాయి. వీటి ఆధ్వర్యంలో ఒక డెస్ట్రాయర్, ఆరు ఫ్రిగేటర్లు, రెండు అఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్లు,



నావికాదళ వందన స్వీకారంలో ప్రధాని నెహ్రూ

విశాఖలో డిసెంబర్ 4

1971 డిసెంబర్ 4... పాకిస్తాన్‌తో యుద్ధంలో మన దేశం ఘన విజయం సాధించడానికి మార్గం సుగమమైన రోజు. ఆ రోజు.. నౌకలపైనా మిస్సైళ్లతో చేసిన దాడితో మన దేశానికి ఘన విజయం లభించింది. డిసెంబర్ 4 వ తేదీ ఉదయం విశాఖ ఆర్‌కె బీచ్‌లోని నేవీ వార్ మెమోరియల్ వద్ద తూర్పు నౌకాదళానికి చెందిన అధికారులు అమర జవాన్లకు నివాళులర్పిస్తారు. 1971 పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో విశాఖకు అతి సమీపంలోకి వచ్చిన పాకిస్తాన్ జలాంతర్గామి ఘాజిని తూర్పు నౌకాదళం తన కిల్లర్ బోట్ల ద్వారా పేల్చివేసింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ కిల్లర్ బోట్లను డీకమిషన్ చేశారు. ఘాజి శకలాలు విశాఖ నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న విశాఖ మ్యూజియంలో ఉన్నాయి.

రెండు మిసైల్ కార్వెట్లు, 18 లాండింగ్ నౌకలు, ఆరు మైనింగ్ స్వీపర్లు, ఆరు మిసైల్ బోట్లు ఉన్నాయి. శత్రుసేనలు పెట్టే మందుపాతర్లను పసిగట్టి వాటిని ఛేధించడానికి మైనింగ్ స్వీపర్లు ఉపయోగించటానికి ఏర్పాట్లు చేశారు.

ఈ తూర్పు నౌకాదళం పరిధి దాదాపు బంగాళాఖాతం అంతా ఉంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల సముద్రతీరంలో ఉన్న 3 వేల కిలోమీటర్ల తీర ప్రాంత రక్షణ బాధ్యత ఈ దళం చూస్తుంది. బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతం నుంచి తమిళనాడు కుటికురన్ వరకూ, అండమాన్, గోవా, నికోబార్ దీవుల తీర ప్రాంతం అంతా దీని పరిధిలోనే ఉంది. ఈ కమాండ్ పరిధిలో 18వేల మంది పనిచేస్తున్నారు. ఇక్కడ చేరే సిబ్బందికి మొదట ఒరిస్సాలోని చిల్కా సరస్సులో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సెయిలర్లకు విశాఖలోనే శిక్షణ ఉంటుంది. 1985 నుంచి ఈ శిక్షణను సదరన్ నేవల్ కమాండ్ (కొచ్చి) ఆధ్వర్యంలో ఇస్తున్నారు.

విశాఖ తీర నావికా దళమా...మజాకానా?!

1956లో పాక్‌తోనూ, 1962లో చైనాతోనూ 1971లో పాకిస్తాన్‌తోనూ జరిగిన యుద్ధాల్లో ఈ కమాండ్ సమర్థవంతమైన పాత్ర పోషించింది. 1961లో పోర్చుగల్ ఆధీనంలో ఉన్న గోవాను భారతదేశంలో చేర్చటానికి ఈ నావికాదళం విశేషమైన కృషి చేసింది. 1978లో మూర్ దీవిని చేజిక్కించుకోనేందుకు కొంతమంది దుండుగులు చేసిన ప్రయత్నాలను ఈ కమాండ్ సమర్థవంతంగా తిప్పి కొట్టింది.

ఈ కమాండ్ అరుక్కోణం, పోర్టుబ్లెయిర్, విశాఖపట్నం, డిగ్లేపూర్, రామానంద్, ఉత్తర అండమాన్‌లలో ఎయిర్‌స్టేషన్లు నెలకొల్పి నిర్వహిస్తోంది. ఇక్కడ విమానాల నియంత్రణ కూడా తూర్పు నావికాదళం ఆధ్వర్యంలోనే జరుగుతోంది.

ఇరుగు పొరుగు దేశాలకు నౌకలను పంపించటం ద్వారా తూర్పు నావికాదళం అందతో శాంతి సంబంధాలను నెలకొల్పుతోంది. ఇండోనేషియా, జపాన్, మయన్మార్, పిలిప్పీన్స్, సింగపూర్ తదితర దేశాలకు ఏటా నౌకలను పంపుతోంది. ఇవి ఆయా దేశాల్లో భారీ విన్యాసాలు చేసి అందరి ప్రశంసలూ అందుకుంటున్నాయి.

నేవీ డే సందర్భంగా చేసే విన్యాసాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. సాహసయాత్రలు నిర్వహించటం ద్వారా కూడా ఎంతోమందిని ఆకట్టుకుంటున్నాయి. బాలి, అమర్‌నాథ్, గ్యాంగ్‌టక్ ప్రాంతాల్లో ఇవి అనేక యాత్రలు చేశాయి. 17వేల అడుగుల ఎత్తులో హిమాలయంపై ఇండో చైనా సరిహద్దు వద్ద త్రివర్ణ పతాకాన్ని మన నావికులు ఎగురవేశారు. ప్రతి సంవత్సరమూ ఈ నావికాదళం సిబ్బంది చేపడుతున్న ఈ కార్యక్రమాలు పలువుర్ని ఆకట్టుకుంటున్నాయి. భారత నావికాదళ చరిత్రలోనే విశాఖపట్నంలో ఉన్న తూర్పు నావికాదళానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. దీని చరిత్రలో ఎన్నో సంఘటనలు మైలు రాళ్లుగా మిగిలిపోయాయి.

భారత్ నావికాదళానికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది. ఏ దేశానికీ లేని విధంగా అనేక సహజ వనరులు కలిగి ఉన్నందున రక్షణ వ్యవస్థను పటిష్టంగా రూపొందించటానికి ప్రభుత్వపరంగా మరిన్ని చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

అటువంటప్పుడే ప్రభుత్వం చేపట్టే నావికా దినోత్సవాలకు నిజమైన సార్థకత లభిస్తుంది. ★



"దేశ రక్షణలో నౌకాదళానిది కీలకపాత్ర"

ప్రజాశక్తి ప్రతినిధితో తూర్పు నావికాదళ పిఆర్‌ఓ కమడోర్ ఎల్‌ఎన్ ప్రసాద్

ప్రశ్న: తూర్పు నౌకా దళంగా విశాఖ నేవీ ఫోర్స్ ఎలా పనిచేస్తోందో వివరించండి.

జవాబు: దేశ రక్షణతోపాటు సముద్ర జలాల్లో మన వనరుల కాపాడడం, చొరబాట్లను నిరోధించడం, అక్రమ రవాణాను అరికట్టడం తదితర కీలక బాధ్యతలను తూర్పు నౌకాదళం నిర్వహిస్తోంది. బంగాళాఖాతం, మలక్కా జలసంధి, దక్షిణాన ఉన్న హిందూ మహాసముద్రంలో కొంత భాగం తూర్పు నౌకాదళ పరిధిలోకి వస్తాయండి.

ప్రశ్న : ఈ తూర్పు నౌకాదళ విభాగం ఏర్పాటు, ప్రాధాన్యత చెప్పండి.

జ : 17, 18 శతాబ్దాల్లో బ్రిటిష్, ఫ్రెంచ్, డచ్ దేశాలు గారిసన్స్ అండ్ ట్రేడింగ్ అవుట్ పోస్టులను కలకత్తా, మద్రాస్, పాండిచ్చేరిల్లో ప్రారంభించారు. 20 వ శతాబ్దంలో తూర్పు తీరంలో సరుకుల రవాణాకు విశాఖపట్నం ప్రధాన ట్రాన్సిట్ పోర్టుగా ఆవిర్భవించింది. తూర్పు నౌకాదళానికి చెన్నయ్‌లో ఒక బేస్, కోల్‌కత్తాలో లాజిస్టిక్స్ సపోర్ట్ యూనిట్ ఉన్నాయి. విశాఖపట్నం, అరక్కోణ్, రామ్‌నాథ్‌లో ఎయిర్ స్టేషన్లు ఉన్నాయి. పారదీప్‌లో ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్, తిరునెల్వేలిలో కమ్యునికేషన్ సెంటర్ ఉన్నాయి. తూర్పు తీరానికి మొదటి నుంచీ వాణిజ్య పరమైన ప్రాధాన్యతుంది. పొరుగున ఉన్న శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, థాయిలాండ్, మయన్మార్, బంగ్లాదేశ్‌లతో స్నేహం ద్వారా సత్సంబంధాలు పెంపొందించుకుని... సముద్ర జలాల్లో తుపాన్లు, ప్రమాదాలు జరిగినప్పుడు, పర్యావరణ పరిరక్షణ, స్మగ్లింగ్, డ్రగ్స్ రవాణాల నిరోధానికి కృషి జరుగుతోంది.

(పి.యు.ఎస్.భాస్కరరావు, స్టాఫ్ రిపోర్టర్, విశాఖపట్నం).



ఆరోగ్యం

విటమిన్ల కథ

డాక్టర్ నాగినేని భాస్కరరావు

విటమిన్ - హెచ్

బయోటిన్ నీటిలో కరిగే విటమిన్. గ్లూకోనియోజెనిసిస్‌లోనూ, కొవ్వు ఆమ్లముల తయారీలోనూ బయోటిన్ ముఖ్యపాత్ర వహిస్తుంది. కొన్ని ప్రత్యేక అమైనో ఆమ్లముల తయారీలోనూ బయోటిన్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆహార పదార్థాలలో బయోటిన్ ఒక మాంసకృత్తితో బంధం వేసుకొని ఉంటుంది. శోషింపబడటానికి ఈ బంధం విచ్ఛిన్నమవ్వాలి. బయోటినేజ్ అనే ఎంజైము ఈ బంధాన్ని తెంచి బయోటిన్‌కు స్వేచ్ఛనిచ్చి రవాణాకు తోడ్పడుతుంది.

దీని రోజువారీ అవసరం పెద్దలకైతే 50 నుంచి 200 మి.గ్రా. ఉంటుంది. పాలిచ్చే తల్లులకైతే ఇంకా అదనంగా అవసరమవుతుంది. బయోటిన్ లోపం ఉన్న వారిలో అనేక లక్షణాలు మనకు కన్పిస్తాయి. మానసికంగా మార్పులు, మానసిక కుంగుబాటు, భ్రాంతికి లోనవడం, చీమలు పారినట్లు ఉండటం, ఆకలి లేకపోవడం, వాంతి వచ్చినట్లు ఉండటం, చర్మంపై పొట్టు ఊడిపోవడం, కళ్ళు, ముక్కు, నోటి చుట్టూ, అలాగే కాళ్ళు, చేతులపై దురద పెడుతూ దద్దుర్లు వస్తాయి.

చిన్న పిల్లలు, శిశువుల్లో బయోటిన్ లోపం వల్ల కండరాల బలహీనత, బద్ధకం, చికాకు, తలపై జుట్టు ఊడిపోయి బట్టతల రావడం, చెవులతో సహా ఒక రకమైన దద్దులు శరీరంపై రావడం ఉంటాయి.

శిశువుల్లో పుట్టుకతోనే వచ్చే బయోటిన్ లోపం రెండు రకాలుగా ఉంటుంది. మల్టిపుల్ కార్బోక్సిలేజ్ డెఫిషిఎన్సీ సిండ్రోమ్ అనేది శిశువు పుట్టిన మొదటి వారంలోనే వస్తుంది. మెటబాలిక్ కెటో ఎసిడోసిస్, చర్మ వ్యాధి వస్తుంది. దీనికి చికిత్సగా రోజుకు 10 మి.గ్రా. బయోటిన్‌ను ఇస్తారు. ఇక రెండవది ఆలస్యంగా అంటే మూడు నుంచి ఆరు నెలల వయస్సులో వచ్చే బయోటిన్ లోపం. దీనిలో చర్మ వ్యాధి, మూర్ఛలు, అటాక్సియా, కండరాల బలహీనత, మెటబాలిక్ ఎసిడోసిస్ ఉంటాయి.

లాబొరేటరీలో నిర్వహించే పరీక్షలో బయోటిన్ లోపాన్ని మూత్రంలో దాని కాన్సెంట్రేషన్ తగ్గడాన్ని బట్టి నిర్ధారిస్తారు. కాలేయం, సోయాబీన్, చిక్కుడు గింజలు, ఈస్టు, గుడ్డు పచ్చసొన వంటి ఆహార పదార్థాలలో బయోటిన్ ఎక్కువగా లభిస్తుంది. చిక్కుడు జాతికి చెందిన ఇతర కూరగాయల్లో, పుట్ట గొడుగుల్లో, కాలిఫ్లవర్, కొన్ని ధాన్యాలలో కూడా బయోటిన్ కొంత మేరకు లభిస్తుంది. చిన్న ప్రేవుల్లోని బ్యాక్టీరియా బయోటిన్‌ను తయారు చేస్తుంది. కాని దీనికి మానవుల్లో ప్రాధాన్యం లేదు. ఎద్దు కాలేయం, పాలిష్ చేయని బియ్యం, పండ్లు, పాలల్లో కూడా బయోటిన్ లభిస్తుంది.

☆

లాభం - గూబం

ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్లిన దయానంద్ రెండువేలు పెట్టి భార్యకు ఓ చీర కొన్నాడు. అంత డబ్బు ఖర్చు చేసి కొన్నందుకు భార్య కోప్పడుతుందేమోనని ఐదు వందలకే కొన్నట్లుగా ఉత్తరంలో రాసి చీరను కొరియర్‌లో పంపాడు.

వారం తర్వాత భార్య నుండి లెటర్ వచ్చింది. "మీరు పంపిన చీర వెయ్యి రూపాయలకు అమ్మేశాను. లాభసాటిగా ఉంటుంది. ఇంకో పది చీరలు వెంటనే పంపండి" అని రాసిందావిడ

- పెండెం జగదీశ్వర్

కథ

బాణాసంచా వెలక్కపోయినా... ఇంట్లో పొయ్యి వెలిగింది ఆ కుటుంబ సభ్యుల ఆకలి కళ్లల్లో వెలుగు రవ్వలు చిమ్ముతూ...

వెలుగు రవ్వలు

ఎస్ హనుమంతరావు

ప్రతి ఏడాదీ దీపావళి వచ్చినట్లే... మొన్నటి దీపావళీ వచ్చి వెళ్లింది. కానీ ఈ దీపావళి నాడు...

శీతాకాలం కావడంతో సాయంత్రం ఆరు దాటిందో లేదో రాత్రయినట్లే ఉంది. ప్రతి ఇంటి గడపల ముందూ, వీధి గోడల మీదా ప్రమిదల వరుసలు వెలుగుపూలు విసురుతున్నాయి. మతాబులూ, కాకరపువ్వొత్తులూ, ఫౌంటెన్లూ కాంతులను చిమ్ముతున్న చిచ్చుబుడ్లూ, నింగికెగురుతున్న తారాజువ్వలూ, టపాకాయలూ, బాంబుల మోతలూ... ఇలా ప్రతి ఇంటి ముందూ ఒకటే హంగామా. ఆ వాతావరణం హాలీవుడ్ సినిమాకు ఏ మాత్రమూ తీసిపోలేదు. ఒక్క రాంబాబు వాళ్ల ఇంటి ముందు మాత్రం... ఏదో వెలితిగా... బోసిగా... దిగులుగా... చీకటిగా ఉంది.

పన్నెండేళ్ల రాంబాబు... అరుగు మీద నిలబడ్డాడు. పదేపదే వీధి చివరికి చూస్తున్నాడు. అతని మొహం దిగులుతో నల్లగా ఉంది. కళ్లు చీకటిలో బిక్కుబిక్కుమంటూ... ఆరిపోయే ప్రమిదల్లా ఉన్నాయి. అవును... వత్తులేసుకుని ఆశగా ఎదురుచూస్తున్నట్లున్న ఆ కళ్లు... అచ్చం ప్రమిదల్లానే ఉన్నాయి. ఆ అబ్బాయి ఎదురుచూస్తున్నది అతని తల్లి కోసమో... తండ్రి కోసమో కాదు. తండ్రి స్నేహితుడు తరుణయ్య కోసం!. ఎందుకు?

ప్రతి దీపావళికీ తరుణయ్య కోసమిలా ఎదురుచూస్తూనే ఉంటాడు రాంబాబు. తరుణయ్య కారం వ్యాపారం చేస్తాడు. ఎండు మిరపకాయలను మిల్లులో ఆడించడం, ప్యాకెట్లు చేయడం, కొట్లకు సరఫరా చేయడం అతని పని. ప్రతి దీపావళి సీజన్లో బాణాసంచా షాపు పెడతాడు. సామాన్లు పెట్టడానికి అతనికి చెక్కబల్లలు అవసరమౌతాయి. రాంబాబు వాళ్లింట్లో ఉన్న రెండు బల్లలను అడిగి తీసుకెళతాడు తరుణయ్య. వ్యాపారం ముగిసిన తర్వాత మళ్లీ బల్లలను రిక్షాలో తీసుకొచ్చి అప్పజెబుతాడు. బల్లలను తీసుకున్నందుకు డబ్బులిస్తే స్నేహితుడు బాధపడతాడని బాణాసంచా సామాను ఇస్తుంటాడు తరుణయ్య. ఆ సామాను కోసమే... కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నాడు రాంబాబు.

ఒకప్పుడు రాంబాబు వాళ్లది కింది మధ్యతరగతి కుటుంబం. రాంబాబు తాతయ్య నీటిపారుదల శాఖలో లష్కర్‌గా పనిచేశాడు. జీతంతో పాటు రైతులిచ్చే ధాన్యం, పళ్లూ కూరగాయలు మొదలైన వాటితో బాగా జరిగిపోయేదా కుటుంబానికి. అప్పుడు చేయించినవే ఆ చెక్క బల్లలు. రాంబాబు తండ్రి రంగయ్యకు చదువు సరిగా అబ్బలేదు. వ్యాపారంలో దిగాడు. తగిన పెట్టుబడి లేక అప్పులపాలయ్యాడు. చివరికి వ్యాపారం మూలబడింది. సరిగా అదే సమయంలో రాంబాబు తాత రిటైరయ్యాడు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో రెండు మూడు సంవత్సరాలు ఏదో బాగానే లాగించారు. ఆ తర్వాత పరిస్థితి బాగా దిగజారింది. రంగయ్య ఏదో చిన్నాచితకా ఉద్యోగం చేసేవాడు. వచ్చే అరకొర జీతం వాళ్ల అవసరాలను తీర్చే స్థాయిలో ఉండేది కాదు. ఇంట్లోని ఒక్కో వస్తువుకూ కాళ్లొచ్చేవి. కొట్టుకో, మార్కెట్టుకో చేరుకునేవి. అతి కష్టం మీద సంసారం నడుస్తోంది. ఆ రోజు పండగైనా... నెలాఖరుకావడంతో పస్తు తప్పలేదు ఆ కుటుంబానికి. ఇక దీపావళి సామానేంకొంటారు. రాంబాబుకు ఒకవైపు ఆకలి మండిపోతోంది. అయినా అందరి పిల్లల్లా మందులు కాల్చుకోవాలని ఆ కుర్రాడి తపన. అందుకే తండ్రి మూడ్ గ్రహించకుండా వాటికోసం పేచీ పెట్టాడు. చివరికి దెబ్బలు తిన్నాడు.

ఇప్పుడు మిగిలిన ఆశల్లా... తరుణయ్య బల్లలు తిరిగిస్తూ... ఇచ్చే మందుసామాను మీదే... సమయం ఏడు దాటుతుండగా... వీధి చివర తరుణయ్య రిక్షాలో రావడం రాంబాబు గమనించాడు. హమ్మయ్య... నిరీక్షణ ముగిసింది. రాంబాబు కళ్లు మతాబుల్లా వెలిగిపోయాయి. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. రిక్షా ఇంటి ముందాగింది. రిక్షా అబ్బి సాయంతో రెండు బల్లలనూ ఇంట్లోకి చేర్చాడు తరుణయ్య. రంగయ్య లోపలి గదిలోంచి బయటికొచ్చాడు. తరుణయ్యను పలకరించాడు నీరసంగా.

"ఈ ఏడు యాపారమెలా ఉంది"

"పర్లేదు... ఎండలు కాచాయి కదా..."

రాంబాబు కళ్లు హుషారుగా మందుసామాను గురించి వెతకడం ప్రారంభించాయి. మెట్లు దిగుతూ తరుణయ్య కొంచెం ఇబ్బందిగా మొహం పెట్టాడు. జేబులోంచి ఓ ఏభై రూపాయల నోటు తీసి రంగయ్య చేతిలో పెట్టాడు.

"ఏమనుకోకు... మందులన్నీ అమ్ముడుపోయాయి. పిల్లలకోసం ఏమీ తేలేకపోయా" అని చెప్పి వెంటనే రిక్షా ఎక్కి వెళ్లిపోయాడు. అది అబద్ధం. మిత్రుని ఆర్థిక పరిస్థితి గురించి తరుణయ్యకు బాగా తెలుసు. అందుకే బల్లలకు అద్దె... అనకుండా పిల్లల వంకతో తనకు తోచిన డబ్బులిచ్చాడు.

అతనటు వెళ్లగానే సంచితో కిరాణా కొట్టుకెళ్లాడు రంగయ్య. అది చూసిన రాంబాబు హతాశయుడయ్యాడు. వీధి అరుగు మీదే కూలబడిపోయాడు.

ఆ రాత్రి రాంబాబు ఇంటి ముందు ఏ బాణాసంచా వెలక్కపోయినా... ఇంట్లో పొయ్యి వెలిగింది ఆ కుటుంబ సభ్యుల ఆకలి కళ్లల్లో వెలుగు రవ్వలు చిమ్ముతూ... ★

ఓ మంచి పుస్తకం

ప్రాచీన భారత దేశం

వి. రామకృష్ణ



ప్రాచీన భారత దేశం, రచయిత : డిఎన్‌ఝా అనువాదం : తల్లావఝుల నళిని, ప్రజాశక్తి 944వ ప్రచురణ, ప్రథమ ముద్రణ: ఏప్రిల్ 2005, పేజలు : 131, వెల : రూ.40/- ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలలో

ఇది ప్రాచీన యుగ భారతదేశ చరిత్రను చరిత్ర పూర్వయుగం నుండి గుప్తుల కాలం దాకా వివరిస్తుంది. ఎనిమిది ప్రకరణలున్నాయి.

చరిత్ర రచన స్థల కాలాదులకు మించి ఉండదు. మారుతున్న సమాజం ఆర్థిక, సామాజిక పరిస్థితులు తెచ్చే భావజాల మార్పులకనుగుణంగా చరిత్ర రచనా తీరుతెన్నులు, పద్ధతులు మారుతూ ఉంటాయి. భారత దేశ చరిత్ర రచనలో వలస చరిత్ర కారుల రచనలను ఖండిస్తూ, జాతీయ భావజాల స్ఫూర్తితో వచ్చిన చరిత్రలు కొత్తపుంతలు తొక్కాయి. జాతీయ చరిత్రకారుల రచనల్లో ప్రధానంగా రాజవంశ చరిత్రలకే ప్రాముఖ్యం లభించింది. పైగా భారత దేశ గత వైభవాన్ని 'హిందూ జాతి' ప్రాశస్త్యాన్ని మోతాదుకు మించి కీర్తించారు. దీంతో రచనలో సమతూకం కుంటుపడింది. 1950 దశకం నుంచి భారత దేశ చరిత్ర రచన కొత్త మలుపు తిరిగింది. చారిత్రక భౌతికవాదంతో గతితార్కికతను జోడించి, గతాన్ని విశ్లేషించే నూతన పక్రియ ఆరంభమైంది. కాలక్రమణికను పూసల్లో దారంలా అనుసరిస్తూ, రాజకీయ ఘటనల నేపథ్యంలో ఆర్థిక సామాజిక సాంస్కృతికాంశాలకు ఈ రచనా పద్ధతి పెద్దపీట వేసింది. దీంతో అట్టడుగున పడి కన్పించని కథలు, కొత్త ఊసులు చారిత్రక యుగ సంధుల్లో



వెల్లివిరిసిన మానవజాతి వికాసం ప్రాణం పోసుకున్నాయి. పుక్కిటి పురాణాలకు కాలం చెల్లిన భావాలకు, వలస చరిత్రకారుల రచనలకు స్వస్తిపలికింది. శాస్త్రీయ ఆధారాలతో ముఖ్యంగా పురావస్తు పరమైన వాటితో సత్యాన్వేషణ చేయబూనిన ఈ పక్రియకు దామోదర ధర్మానంద కొశాంబి ఆద్యుడు కాగా, అదేదారిలో రచన చేసిన రోమిలా థాపర్, ఆర్‌ఎస్‌శర్మ సరసన ఈ గ్రంథకర్త నిలుస్తాడు. వేదకాలపు నాగరికత కంటే ఆర్యుల రాకకుపూర్వమే ఎంతో ముందు నెలకొన్న హరప్పా నాగరికతలోని వైశిష్ట్యాన్ని ఆర్యుల వలసను ప్రశ్నిస్తూ తప్పుడు సిద్ధాంతాలను నిర్ద్వంధంగా ఖండిస్తుందీ గ్రంథం. అశోకుడు ప్రవేశపెట్టిన ధర్మాన్ని విపులీకరించడం లోనూ గుప్తుల యుగాన్ని స్వర్ణయుగంగా అభివర్ణించడంలోని అనౌచిత్యాన్ని బలమైన ఆధారాలతో ఖండిస్తుంది. అప్పుడు నెలకొన్న పీడిత కులవ్యవస్థ మనుధర్మశాస్త్రం స్త్రీల పై విధించిన ఆంక్షలు, గుప్తులు చేసిన వినాశకర యుద్ధాలవల్ల సామాన్య ప్రజానీకం పడిన బాధలు ఇవన్నీ కలిసి గుప్తుల యుగాన్ని స్వర్ణయుగంగా పరిగణించడానికి అంగీకరించండీ గ్రంథకర్త. స్వర్ణయుగమనేది ఒక ఊహాజనిత స్వప్నంగా సుదూర భవిష్యత్తులో ఆవిష్కరింపదగిన ఆశయంగా ప్రకటిస్తాడు. ఆసక్తితో పాటు లోతైన చారిత్రక అవగాహనను కలిగించే ఈ గ్రంథంలోని భాష సరళంగా ఉండడమే గాక వెలకూడా సరసంగా ఉంది. ☆



నాగసూరి వేణుగోపాల్

సుముహూర్తం... దుర్ముహూర్తం

"అమృత ఘడియలు... సుముహూర్తం..." అంటూ బోలెడు సమాచారం చదివేస్తున్నాడు. సంప్రదాయదుస్తులలో వున్న టీవీ యాంకరు. ప్రతి ఉదయం దీన్ని తప్పక చూడటం కామాక్షి అలవాటు. గతంలో అయితే ఈ సమాచారం వార్తా పత్రికలో చదువుకుని, దాని ప్రకారం తన దినచర్యను అటూ ఇటూ మార్చుకోవడం కూడా చాలా సహజం. ఇలా చేస్తేనే ఎక్కువ లాభదాయకం లేదా తక్కువ సమస్యలమయం అని ఆవిడ నమ్మిక. ఇలా భక్తి రసం ఉప్పొంగే కార్యక్రమాలతో ఉదయాన్ని ప్రారంభించి, తర్వాత ఇలాంటి భక్తి సమాచారం ఆస్వాదించి, పిమ్మట విలనీ స్త్రీల గృహహింసతో ప్లావితం అయ్యే సీరియళ్ళు, బోలెడు తిలకించి, నేరవార్తలు గగుర్పాటుతో దానిని ముగించడం ఆవిడ అలవాటు.

టీపాయి మీద జంతికల డబ్బా వుంచుకొని నోటితో నములుతూ మధ్యాహ్నం సీరియళ్లలో మునిగిపోయింది కామాక్షి "అత్తగారు" సీరియల్‌లో కయ్‌మని అరవడమేకాదు. కరుస్తున్నారు. బుల్లి తెర కోడలు కృంగిపోతూ- మనసులో మెటికలు విరుస్తోంది. "ఏ ప్రమాదం జరుగకుండా వుండాలంటే మా గ్యాస్‌స్టవ్ మాత్రమే వాడండి" అంటూ ఒక ప్రకటన. ఏ ప్రమాదమైనా జరిగితే "మా ప్రఖ్యాత ఆస్పత్రి ఒకటే రక్షిత మార్గం" అంటూ మరో ప్రకటన. మీ జీవితం సవ్యంగా వుండాలంటే మా రాళ్లే వాడండి, మా రాళ్ళే వుండే ఆభరణాలు ధరించండి అంటూ ఇంకో ప్రకటన జలజలా వచ్చాయి.

"ఇప్పుడు వర్జ్యం నడుస్తుంది. పిన్ని.... మీరు టీవిలో ఈ సీరియల్ చూడటం మంచిదేమో" అంటూ ప్రవేశించింది రమణి

"అదేంటమ్మాయ్... టీవీ చూడటానికి ఏముంది, కాలు కదలకుండా టీవీ చూడటమే కదా.... దీనికి వర్జ్యం, ముహూర్తం ఎందుకు ?" అని ఎదురు ప్రశ్న వేసింది కామాక్షి పిన్ని.

"మరి అలాంటపుడు అన్నింటికీ పంచాంగం చూసి ముందుకెళ్ళమని చెబుతారే మీరు. మీకు ముహూర్తం అక్కరలేదా ?" అని ఆటపట్టించాలని ప్రయత్నిస్తోంది రమణి.

అంతలో చేతిలో మోగిన సెల్‌ఫోన్ అందుకుంది కామాక్షి "ఏంటి మీనాక్షి.. మీ అమ్మాయికి కాన్పు రోజు దగ్గిరపడిందా ? ఇంట్లోనే కానుపు చేయాలని భావిస్తున్నారా?... కాస్త... విను... ఇంట్లో కాన్పు వద్దు... మీరు నాలుగు కిలోమీటర్లు వెళ్లితే మంచి హాస్పటల్ వస్తుంది. అందులో చేర్పించు. అంతేకాకుండా మంచి ముహూర్తం చూసి సిజేరియన్ చేయించి సుముహూర్తాన అమ్మమ్మ అవ్వవే మీనాక్షి.. మంచి ముహూర్తమయితే అబ్బాయి అయినా, అమ్మాయి అయినా ప్రయోజకులవుతారు. నా మాట వినవే తల్లీ.. అంటూ ఫోన్‌లో వాయించేసింది. ఫోన్ వారు చేశారు కనుక బిల్లు సమస్య కూడా లేదు. అందుకే ముహూర్తం గురించి బహృత్ ప్రసంగం మహత్తరంగా దంచింది.

కామాక్షి సెల్‌ఫోన్ కబుర్లు వింటే రమణికి తన డాక్టర్ ఫ్రెండ్, చెప్పిన విషయాలు గుర్తుకు వచ్చాయి. మంగళవారాలు, అమవాస్య, పున్నమి రోజుల్లో ఆస్పత్రిలో రద్దీ తక్కువగా వుంటుందని, మరీ తప్పని వారయితే ఆ రోజుల్లో ఆస్పత్రికి వస్తారని డాక్టరుగారన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"సరే పిన్ని.... మనం దేనికి ముహూర్తాలు పెట్టుకోవచ్చు. కాస్త చెప్పు" అంటూ రమణి అడిగింది.

చాలా ఆనందపడి పోయిన కామాక్షి "పట్టు చీర ధరించడం...నగలు ధరించడం పండుగలకీ, శుభకార్యాలకీ కదా ! వాటికి ఎలాగూ ముహూర్తాలు వుంటాయి కదా, నేనయితే ఇల్లు వదలి, గడప దాటాలంటే ఘడియ చూస్తాను- ఎందుకయినా మంచిదని...." అని జవాబు ఇచ్చింది.

దాంతో రమణికి చిన్నప్పుడు చదువుకున్న వేమన పద్యం స్ఫురించింది. పంచాంగం పండితులంతా కలిసి ముహూర్తాలు గట్టా పెట్టి, పెళ్ళిళ్ళు చేసి, భోజనాలు చేసి పోయారే ! మరి పెళ్లికూతురు వితంతువు ఎలా అయ్యిందే- అని వేమన ఏనాడో అడిగాడు. అదే విషయం వివరించడానికి ప్రయత్నించింది.

రమణి దాంతో మండిపడిన కామాక్షి "ఇదిగో ముహూర్తాలు గురించి అడిగితే నీ అభిప్రాయాలు మారాయేమోనని జవాబు ఇచ్చాను. అంతేకానీ ఇలా వితండవాదం చేయకు... ఈ మధ్య చూశావా దినఫలాలు, జ్యోతిష్యం ప్రకటించన్ని ప్రతికలు కూడా ఆ వివరాలు ఇస్తున్నాయి" అంటూ తన నమ్మకాలకు ఆధారాలు చూపబోయింది.

చదువుతారని పత్రికలు ప్రచురించడం, ప్రచురించారని ప్రజలు చదవడం- ఇది లాంటిది. ఇదే రీతితో ముహూర్తాల ప్రకారం సిజేరియన్ ఆపరేషన్లు అడగటం.. ప్రజలు అడిగారని ఆపరేషన్లు చేసి డాక్టర్లు పెద్ద బిల్లులు వేయడం మామూలైంది. డాక్టర్లు కూడా పోటా పోటీగా బాగా డబ్బు వచ్చిపడే స్టార్ హాస్పటల్స్ కడుతున్నారు. ఆపరేషన్ కోతకు, రాకెట్ ఎగరవేతకు సుముహూర్తాలు వర్జ్యాలు చూడటం మన సెన్సుకి కామన్ సెన్సుకి అస్సలు సెన్సుందా అని ?!.

★

ఓ ఊరి కథ

ఎకె. శ్రీనివాస్

ప్రాణం పోసిన పాణ్యం

కొన్ని గ్రామాల వెనుక దాగి ఉన్న చరిత్ర ఆధారంగా వాటికి పేర్లను నిర్ణయిస్తారు. మరికొన్ని ప్రాంతాలకు గల పేర్ల ఆధారంగా ఆయా ప్రాంతాలకు చరిత్రను జతచేస్తారు. ఈ క్రమంలోనిదే ఈ పాణ్యం గ్రామానికి సంబంధించిన కథ. ఓ రాజు... తన పొరబాటును సరిదిద్దుకోవడంలో భాగంగా ప్రజాతీర్పును అమలు పరిచాడని ఆ గ్రామస్తులు చెప్పుకునే ఈ కథే... పాణ్యం.

కర్నూలు నంద్యాల మధ్య 18వ నెంబరు జాతీయ రహదారి పక్కనే పాణ్యం గ్రామముంది. ప్రస్తుతం నర్సరీలకు నిలయంగా మారి రాష్ట్రంలోనే తనకంటూ ఓ ప్రత్యేక స్థానం పొందింది. ఈ పాణ్యం వెనుక దాగున్న కథ ఆ గ్రామస్తులు చెప్పుకుంటున్నట్లుగానే...

13 శతాబ్దంలో చోళ రాజైన విష్ణు వర్ధన మహారాజు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. ఆ సమయంలో అతని కూతురు మూడు నెలల పసిబిడ్డ. 15 సంవత్సరాల అనంతరం ఆయన తన రాజ్యానికొచ్చాడు. నేరుగా తన శయన మందిరానికెళ్లాడు. చీకటి మందిరంలో నిద్రిస్తున్న తన కుమార్తెను మహారాణిగా భావించాడు. ఆమెపై చేతులేశాడు. కుమార్తె ఉలిక్కిపడి లేచింది. హతాశురాలైంది. తండ్రి రూపురేఖలను పోల్చు కోలేకపోయింది. 'ఎవరు నీవు?' అని ప్రశ్నించింది. శయన మందిరాన్ని వదలి వెళ్లిపోయింది. మహారాజు తన పొరబాటును గ్రహించాడు. 'కూతురిపై చేతులు వేసిన అపరాధికి శిక్ష ఏమిటి' అని ప్రజలనుద్దేశించి ప్రశ్నించాడు. 'అతని రెండు చేతులను ఖండించాలి' అని వారన్నారు. ప్రజాతీర్పును విన్న ఆ మహారాజు వెంటనే... సైనికులను పిలిచాడు. తన రెండు హస్తాలనూ ఖండించాలని ఆదేశించాడు. సైనికులు రాజాజ్ఞను శిరసావహించారు. ఆ బాధను మహారాజు భరించలేకపోయాడు. ప్రాణ త్యాగం చేయాలని తలంచాడు. పాణ్యం ప్రాంతానికి చేరుకున్నాడు. దూరంగా ఒక పెద్ద పాము పుట్ట కనిపించింది. ఆ పుట్టలో తన రెండు చేతులను ఉంచాడు. వెంటనే... స్పృహ తప్పాడు. కొద్ది సేపటి తర్వాత అతని ఆశ్చర్యానికి అంతులేదు. కారణం... తన చేతులు యధాతథంగా ఉన్నాయి.

అదే రోజు రాత్రి... అతనికి శివదర్శనం లభించింది. 'ఈ ప్రాంతంలో నా ఆలయాన్ని నిర్మించి, పూజలు నిర్వహించు' అని చెప్పి శివుడు అదృశ్యమయ్యాడు. అదేవిధంగా రాజు శివాలయం నిర్మించి శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడి శివునికి పాణినేశ్వరుడంటారు. పాణి అనగా చేతులు. రాజుకు రెండు చేతులూ ప్రసాదించడం వలన శివునికి ఆ పేరొచ్చింది. ఈ పేరు వల్లే ఈ ప్రాంతం పాణీయంగా మారింది. కాలక్రమేణా పాణ్యంగా వాడుకలోకొచ్చింది.

ఈ గ్రామంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లమాకుల నీటి బుగ్గ చూపరులను విశేషంగా ఆకర్శిస్తుంది. ఏ కాలంలోనైనా నీరు తరగకుండా ఉండడం ఈ బుగ్గ ప్రత్యేకత. దీన్నే ప్రాణాధార అంటారు. ఈ బుగ్గ ఉండటంతోనే ఈ ప్రాంతం నర్సరీలకు నిలయంగా మారింది. చోళరాజుల కాలంలో నిర్మించిన వీరనారాయణస్వామి ఆలయం, బృంగేశ్వరాలయం, ఆంజనేయ స్వామి, అగస్తీశ్వరాలయం వంటివి ఈ గ్రామానికి ప్రధానాకర్శనలు. పాణికేశ్వరాలయాన్ని పురావస్తుశాఖ స్వాధీనం చేసుకుంది.



పాణికేశ్వరాలయ గాలి గోపురం

ఈ దేవాలయంలో గుప్తనిధులున్నాయని అనేకమంది భావన. ఫలితంగా ఈ ఆలయం ఇప్పటివరకు రెండుసార్లు దోపిడికి గురైంది. క్రమంగా శిధిలావస్థకు చేరుకుంటోంది. ★



అవీ... ఇవీ

అందాల ముళ్ళ కిరీటం

అందమూ నిత్యావసర వస్తువేనని భ్రమింపజేశాక
అందమంటే మన కంటికి అంకెలుగానే తోస్తుంది
అల్లంత దూరంలో అమెరికా అందాల వేదిక
ప్రపంచంలోని ప్రతి దేశాన్ని ఊరిస్తుంది.
శ్రమైక జీవన సౌందర్యం విలువలూడదీసుకున్నాక
విలువలు లేని కృత్రిమ సౌందర్యం
అంతర్జాతీయ వేదిక మీద బొమ్మల కొలువవుతుంది
నూలుపోగైనా లేని నునుపైన అందాలకు
చిలుక పలుకుల జవాబులద్దిన లిప్‌స్టిక్ పెదాలకు
వ్యాపారమంత స్వచ్ఛంగా విరబూసే ప్లాస్టిక్ నవ్వులకు
బరువయిన కిరీట బహుకరణ
బహుళజాతి మోసానికి పరాకాష్టవుతుంది.
మన ముడి సరుకుల్ని కొల్లగొట్టి
వాడి మురికి వస్తువుల్ని మార్కెట్ చేసే మాయాజాలంలో
దేశ దేశానికో అవకాశవాదకిరీటం బహుకరిస్తూపోతాడు
భూగోళానికి అన్నివైపులా
సౌందర్యం సరళీకరణ ద్వారాలు తెరుస్తాడు
మనల్ని మనం కోల్పోయాక గానీ
మన జీవన ఫలాలే వాడి మార్కెట్ వస్తువులై
మన కళ్ళముందే ప్రత్యక్షమయ్యాకగానీ
ఇంతకాలం మనం మోస్తున్నది
ఒక అందాల ముళ్ళ కిరీటమని తెలియదు
ఇంత కాలం మనల్ని ఊరిస్తున్నది.
బాహ్య సౌందర్యాన్నిప్రదర్శనకు పెట్టి
మన జీవన సౌందర్యాల్ని కొల్లగొట్టే
ఒక గ్లోబల్ వ్యూహామని స్ఫురించదు.

- చిత్తలూరి సత్యనారాయణ

జనం సొమ్ము రాణీ పాలు

రాజుల సొమ్ము రాళ్ల పాలన్నది ఒక సామెత. నిజానికది జనం సొమ్మే. బ్రిటన్‌లో మాత్రం జనం సొమ్ము అక్కడి రాణుల విలాసాల పాలౌతోంది. రాజకుటుంబీకులు ప్రత్యేక విమానాలలో తప్ప ప్రయాణించరు. డబ్బుకు అంత విలువ ఇస్తారు మరి. గతేడాది ప్రిన్స్ ఛార్లెస్, ఆయన తాజా భార్య కొమిల్లా ప్రయాణ ఖర్చు 50 లక్షల పౌండ్లు.(పౌండు విలువ 80 రూపాయల వరకు ఉంది). దీనిలో విమానాలకు చేసిన ఖర్చు 38లక్షల పౌండ్లు. ఈ మొత్తంలో జనం చెల్లించిన పన్నులు 30లక్షల పౌండ్లున్నాయి. ఇంతకూ ఈ ఖర్చు దేనికనుకుంటున్నారు. శ్రీలంకలో సునామీ బాధితులను చూడటానికి రాజకుటుంబ సభ్యులు వచ్చినందుకు మాత్రమే. అందరూ ప్రయాణించే విమానాలలో వారు వస్తే ఆ సొమ్మును బాధితులకు సహాయంగా ఇవ్వొచ్చు కదా . ఇక రాజకుటుంబానికి ఏడాదికి అయిన ఖర్చు 3కోట్ల 67 లక్షల పౌండ్లు. రాణీగారు ఇచ్చే పార్టీలకు వచ్చే వారు బకాసురులకు తక్కువగాకుండా ఉండి ఉండాలి మరి. ఎందుకంటే సగటున కనీసంగా కేకులు, ఐస్‌క్రీమ్‌లు, శాండ్‌విచ్‌లు 14 రకాలు వడ్డిస్తారట. ఇలా తినిపోయే అతిథులు ఏడాదికి 40వేల వరకు ఉంటారు. కనీసం నాలుగు లేదా ఆరు విందులు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఐదులక్షల పౌండ్లు, ఇతరత్రా వచ్చే అతిథులకు మరో నాలుగు లక్షల పౌండ్లతో మర్యాదలు చేస్తారు. ఇదిగాక రాణీగారి నివాసం ఎప్పుడూ తళతళలాడుతూ ఉండాలి. అతిథులకు పోసే మందు ఖర్చు మరో నాలుగు లక్షల పౌండ్లు. ఇలా ఎడా పెడా ఖర్చు చేయటాన్ని సహించలేని పార్లమెంట్ సభ్యులు కొందరు రాజకుటుంబానికి ఇబ్బందులొస్తాయని హెచ్చరించారట.

- ఎంకెఆర్



ఎన్నెన్ని బలగాలు
కాపలాకాసినా,
మరెన్ని అబద్ధాల
గుంజలు
పోటీ దన్ను పెట్టినా
అగ్రరాజ్యాధికార సౌధం
పేకమేడే...

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

సైన్సూ - సూడో సైన్సూ

అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అని "కన్యాశుల్కం'లో గురజాడ పలికించిన పలుకులు, సైన్సు గురించి ఏమాత్రం తెలియకుండానే అన్నీ తెలిసినట్లు మాట్లాడే ఛాదస్తులకు పొడిచిన ములుకులు. మానవ విజ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. అందుకని విజ్ఞానం విషయంలో ఎప్పుడూ మనకు ముందుచూపే ఉండాలి. కాని సమాజంలో చాలా మంది విజ్ఞానాన్ని పాత యుగాల్లో, పాత గ్రంథాల్లో, పాత ఆచారాల్లో చూస్తుంటారు. చూసి ఊరుకుంటే పేచీ లేదు. కాని ఆచరణలో కూడా పెట్టడానికి ప్రయత్నిస్తారు. అప్పుడే వస్తుంది తంటా. విజ్ఞానం గురించి వెనకచూపు చూసే వారివల్లనే వేద విజ్ఞానం, వేద గణితం, వాస్తు, జ్యోతిష్యం వంటి మూఢనమ్మకాలు బతికి బట్టకడుతున్నాయి. ఇలాంటివారు రాజకీయాల్లోకి వచ్చి అధికారపగ్గాలు చేపడితే ఈ మూఢనమ్మకాలు కూడా అధికారిక హోదా పొందుతాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లు అధికారంలోకి వచ్చాక అక్కడ ఇస్లాం ఛాందసవాదం సైన్సు పేరుతో పాఠ్యాంశాల్లో చేరిపోయింది. మన దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఇక్కడ వేదగణితం, జ్యోతిష్యం వంటివి పాఠ్యాంశాల్లో అధికారికంగా చేరిపోయాయి. అమెరికాలో క్రైస్తవ ఛాందసవాదాన్ని పుణికిపుచ్చుకున్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు జార్జిబుష్ అధికారంలోకి వచ్చాక డార్వీనియన్ 'పరిణామవాదం' స్థానంలో బైబిల్ చెప్పిన 'సృష్టి' వాదాన్ని సైన్సుగా పాఠ్యపుస్తకాల్లో చేరుస్తున్నారు.



అయితే వేదాల్లోగాని, మానవేతిహాసానికి సంబంధించిన పాత గ్రంథాల్లోగాని సైన్సు అస్సలు లేదని కాదు. వేదాల్లోనూ సైన్సు ఉంది. అయితే మన వాళ్లు చెప్పేట్లు గతకాలపు సైన్సుతో బాటు వర్తమాన, భవిష్యత్ కాల సైన్సు కూడా వేదాల్లోనే ఉంది, కాకపోతే మనం దాన్ని అర్థం చెసుకోలేకపోతున్నాం అనే వాదన తప్పు. వేదాల్లోని సైన్సు పాతకాలానికి చెందినది మాత్రమే. మానవులు పశువుల కాపరులుగా, సామూహిక జీవనం సాగిస్తున్న కాలం నాటి సైన్సు అది. చలినుండి రక్షించుకోడానికి నెగడులు (యజ్ఞగుండాలు) వెలిగించడం ఎలా, మాంసం, ఆహారం వండుకు తినడం ఎలా, బండ్లమీదా, చిన్నచిన్న పడవల్లోనూ ప్రయాణాలు చేసే కాలంలో వాటిని ఏ పద్ధతిలో నిర్మించాలి అన్న విజ్ఞానం మాత్రమే అందులో ఉంది. మానవుల చుట్టూ ఉన్న ప్రకృతి, విశ్వం, మానవుని పుట్టుక, జీవనం, వైద్యం వగైరాలకు సంబంధించి నాటి మానవులు తమకు తెలిసిన మేరకు చెప్పిన వివరణలను ప్రాచీన గ్రంథాల్లో నిక్షిప్తం చేశారు. ఈ ప్రాచీన గ్రంథాలు కూడా ఎంత ప్రాచీనమైనవి అన్నదాంట్లో మళ్లీ వివాదాలున్నాయి. ఉదాహరణకు ఒక ప్రాచీన తాళపత్ర గ్రంథంలో తరువాతి తరాల వారు తమకు తోచిన విషయాలు చేర్చేశారు. వీటినే ప్రక్షిప్తాలుగా చెబుతున్నారు.

అందువల్ల ప్రాచీన గ్రంథాల్లోని విజ్ఞానాన్ని ఆ కాలానికి అభివృద్ధి చెందిన విజ్ఞానంగా చూడాలే గాని అందులో సర్వం ఉందని చెప్పడం, ఈనాటి ఆధునిక కాలంలో కూడా వాటినే ప్రమాణంగా తీసుకోవాలనడం మంచిదికాదు సరికదా ఇలాచేస్తే కొన్ని సార్లు వినాశనకర పరిణామాలు కూడా సంభవిస్తాయి. ఉదాహరణకు, మహాభారతంలో పాత్రధారులంతా గదలు, కత్తులు, బాణాలు ఆయుధాలుగా ధరిస్తారు. గుర్రం బండ్ల మీద ప్రయాణాలు చేస్తారు. అంటే మానవుని విజ్ఞానం ఆ స్థాయికి అభివృద్ధి చెందిన కాలంలో రాసిన గ్రంథాలన్నమాట అవి. ఆ తరువాత విజ్ఞానం ఎంతగా అభివృద్ధిచెందిందని! మోటారు వాహనాలు, విమానాలు, రాకెట్లు వచ్చాయి. తుపాకులు, క్షిపణులు, అణుబాంబులు అభివృద్ధి చెందాయి. ఇప్పుడు రాసే గ్రంథాల్లో ఈ ఆయుధాలు, వాహనాలు ఇప్పటి ఆచారవ్యవహారాలు చోటుచేసుకుంటున్నట్లే అప్పుడు రాసిన గ్రంథాల్లో నాటి సైన్సూ, సామాజిక జీవనస్థాయి చోటుచేసుకున్నాయి. అందువల్ల ప్రాచీన గ్రంథాల్లో ఉన్న సైన్సు ప్రాచీనమైనదే. దాన్నే ఇప్పటికీ పట్టుకు వేలాడ్డం అంటే మనం ఆనాటికాలానికి తిరోగమన ప్రయాణం చేస్తున్నట్లే లెక్క

మన ప్రాచీనులు కనుగొన్న విజ్ఞాన శాస్త్రం మీదనే ఆధునిక విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందింది. ఈ ఆధునిక విజ్ఞాన శాస్త్రం మరికొంత కాలానికి మరింత పోగుపడి మరింత ఆధునికమవుతుంది. అదే సైన్సు. అదో నిరంతర ప్రవాహం. కాని ప్రాచీన కాలపు సైన్సును అలాగే ఆపేసి దాన్ని ఇప్పటికీ ఉపయోగించుకుంటామంటే అది సూడోసైన్సు (మిధ్యాశాస్త్రం) అవుతుంది. వేదంలో గణితం ఉండొచ్చు. కాని తరువాత దానిమీద అభివృద్ధి చెందిన గణితాన్నంతటినీ విడిచిపెట్టి ఆ ప్రాచీన గణితాన్నే తప్పితీయాలంటే అది ఛాదస్తం అవుతుంది. వాస్తు శాస్త్రం ఈ నాడు చాలా అభివృద్ధి చెందింది. ఇంజినీరింగ్‌లో పెద్ద సబ్జెక్ట్ అది. ప్రపంచంలో మానవుడు గతంలో ఎన్నడూ ఊహించని ఇంజినీరింగ్ అద్భుతాలు సృష్టించబడుతున్నాయి. వంద అంతస్తులు దాటిన భవనాలు, టిబెట్‌కు రైలు మార్గం, త్రీగోర్జెస్ డ్యామ్, గాలిలో ఎగిరే రైలు, భూగర్భంలో నగరాలు ఇవన్నీ వాస్తుశాస్త్ర అద్భుతాలే. కాని ఏనాడో మన ప్రాచీనులు చెప్పిన 'వాస్తు' గురించి ఇప్పటికీ మనం నమ్ముతున్నామంటే ఏమనుకోవాలి. నమ్మితే సరే కాని ఆ నమ్మకాన్ని ఆచరణలో పెట్టే క్రమంలో చాలామంది నష్టపోతున్నారు. నిర్మించిన ఇళ్లు, భవనాలు కూల్చేస్తున్నారు. వేలు, లక్షలు నష్టపోతున్నారు. కొందరు వాస్తు నమ్మకంతో సంసారాలు కూల్చుకుంటున్నారు.

వాస్తులో సైన్సు లేదా అంటే కొంత ఉంది. అందులో ప్రాచీన కాలంనాటి సైన్సు కొంత ఉంది, ఆనాటి అజ్ఞానమూ ఎంతో ఉంది. ఇంటిలోకి గాలీ వెలుతురూ ధారాళంగా రావడానికి కొన్ని సూత్రాలు అందులో ఉన్నాయి. ఇల్లు సౌష్టవంగా, సమతుల్యంగా ఉండడానికి మరికొన్ని సూత్రాలున్నాయి. ఇల్లు ఈశాన్యం మూలకు తిరిగి ఉంటే నైరుతి, ఈశాన్యం దిశగా ప్రయాణించే గాలి బాగా తోలుతుంది. అలాగే బావి ఇంటికి ఒక మూల ఉంటే దొడ్లు మరో మూల ఉండాలంటారు. అలాగే ఇంటికి ఒక వైపు 'బరువు'(ద్వారబందంగాని, కిటికీగాని) ఉంటే మరోవైపు కూడా సమానమైన 'బరువు' ఉండాలంటారు. నగరాలు, పట్టణాలు ఇంతగా అభివృద్ధి చెందక ముందు, ఏసిలు, ఫ్యాన్లు లేని కాలంలో ఈ సూత్రాలు పాటించాలంటే అర్థం ఉంది కాని అవన్నీ వచ్చాక వాటిని తూచా తప్పక పాటించాలనడం, లేకుంటే ఇంకేదో అనర్థం వచ్చేస్తుందని భయపెట్టడం అశాస్త్రీయం. కొన్ని సార్లు అనర్థదాయకం కూడా. మనిషి జీవితంలో జరిగే ఘటనలకూ, ఇంటి నిర్మాణ 'దోషాలకు' లింకు చేయడం మూర్ఖత్వం. వాస్తులో ఉండే కొద్దిపాటి శాస్త్రీయవిషయాన్ని చూపించి ఆ నాటి మూఢత్వాన్ని నేటికీ కొనసాగించడం అనర్థ దాయకం. అందుకే వాస్తులోని శాస్త్రాన్ని ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన ఆర్కిటెక్చర్, సైన్సు అయింది, వాస్తు సూడోసైన్సుగా, మూఢనమ్మకంగా మిగిలిపోయింది. అలాగే ఖగోళశాస్త్రం సైన్సుగా అభివృద్ధి చెందితే జ్యోతిష్యం మూఢనమ్మకంగా మిగిలిపోయింది. ఇంకా వాతావరణ శాస్త్రం - పంచాంగం, రసాయనిక శాస్త్రం - రసవాదం (ఆల్కెమీ, ఇప్పుడు ఆచరణలో లేదు) ఆధునికవైద్యం - నాటువైద్యం, ఇవల్యూషనిజం - క్రియేషనిజం ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఆధునిక సైన్సు విభాగం వెనుకా ఒక సూడోసైన్సు విభాగం పయనిస్తోంది. సైన్సును నమ్ముకుంటే పురోగమిస్తాం. సూడోసైన్సును ఆదరిస్తే అధోగతికి పోతాం. ★

కొత్త పుస్తకాలు

అంబేద్కర్

డిసెంబర్ 6, అంబేద్కర్ వర్ధంతి

అంబేద్కర్... అణచివేతకు గురైన కులాల నాయకుడు మాత్రమే కాదు. ఆయన జాతీయ నాయకుడు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఉన్నత వర్గాల జాతీయవాదుల కంటే భిన్నమైన వాడు. అంబేద్కర్ చేసిన ప్రతి పనిలోనూ, నడిపిన వివిధ రాజకీయ కార్యక్రమాల్లోనూ, తీసుకున్న రాజకీయ నిర్ణయాల్లోనూ, రాసిన అనేక గ్రంథాలల్లోనూ, స్వాతంత్ర్య ప్రజాస్వామ్య భారత నిర్మాణంలోనూ జాతీయతావాదాన్నే వ్యక్తం చేశారు. భారత ప్రణాళికల రూపకల్పనలోనూ, నీటి పారుదల, విద్యుత్ విధానాలు రూపొందించడంలోనూ ఆయన మహత్తర పాత్ర పోషించారు. 'విముక్తి సాధించడానికి విద్య ఒక సాధనం' అని ఆయన నమ్మారు. ఫలితంగా విద్యాసంస్థలు నెలకొల్పడంలో ఆయన కృషి చేశారు. మార్క్సిజం నుండి ఉత్తేజం పొందిన తన ఆర్థిక విధానాలను స్టేట్ సోషలిజంగా పేర్కొన్నారు. సైద్ధాంతిక, సాంస్కృతిక సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల, ముఖ్యంగా భారతీయ సమాజంలోని కులాన్ని గమనించకపోవడం వల్ల మార్క్సిజం అసమగ్రంగా తయారైందని ఆయన అంటారు. చివరి దశలో ఆయన ఉదారవాద సంక్షేమ రాజ్యం, ఆర్థిక విధానం వైపు పయనించారు.

ప్రపంచంలో ఇప్పటికీ శాంతి, అహింసల ప్రతీకగా గాంధీజీ పేరు ప్రతిధ్వనిస్తూనే ఉంది. అయినప్పటికీ పీడిత తాడిత వర్గాల అభ్యున్నతికీ, సమానత్వం హేతువాదంతో కూడిన నూతన ఆవిష్కరణకూ అంబేద్కర్ ప్రతిరూపం. హిందూ చట్రంలోనే సమానత్వాన్ని జొప్పించడానికి ప్రయత్నించిన గాంధీ... 'జాతిపిత'. ఆ చట్రం నుండి దళితులను విముక్తి చేయడానికి ప్రయత్నించిన అంబేద్కర్ 'మహోన్నత విమోచనకారుడు'. అందుకే ఆయన వారికి బాబా అయ్యారు. దళిత రాజకీయాలు, సంస్కృతిపై సంవత్సరకాలంగా అధ్యయనం చేశారు శ్రీమతి గెయిల్ ఆంవెట్. అక్షరజ్ఞానం కోసం, అస్పృశ్యతను రూపుమాపడం కోసం అంబేద్కర్ సాగించిన పోరాటాన్ని ఆర్ద్రతతో ఆవిష్కరించారు. ఆర్య రామారావు అనువాదం బాగుంది.

-కె. పి. అశోక్ కుమార్

"అంబేద్కర్ వికాస భారతానికి దిశగా...." ఆంగ్ల గెయిల్ ఆవెంట్ అను: ఆర్య రామారావు
అలకనంద ప్రచురణలు, హైదరాబాద్-8, ప్రతులకు అశోక్ బుక్ సెంటర్,
విశాఖపట్నం, 2 అక్షర హైదరాబాద్-34

బుజ్జిగాడు

పిల్లల కథలు- బొమ్మలతో
వెల : 25/-
పేజీలు : 40
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ అన్ని బ్రాంచిలలో దొరుకును.

చిట్టిరాజు-గూనిగుర్రం

(పిల్లల నవల - బొమ్మలతో)
రచన కె. రాజేశ్వరరావు
వెల 25/-, పేజీలు : 48
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ అన్ని బ్రాంచిలలో దొరుకును.

శూన్య పోరాటం

వచనకవితా ప్రక్రియ ఏర్పడిన తర్వాత కవి తన మనస్సులో భావాల్ని సున్నితంగానూ, తేలికగానూ కాగితం మీద పెట్టగలుగుతున్నాడు. ఈ స్పీడు ప్రపంచంలో మనిషి ఒంటరి పోరాటం చేస్తున్నాడని ఆవేదన చెందుతూ, అది 'శూన్యపోరాటమే' అని స్పష్టీకరించారు ఇంద్రజిత్. ప్రముఖ పత్రికలలో వివిధ రచనలకు బొమ్మలేసే ఇంద్రజిత్ ప్రముఖ చిత్రకారుడిగా అందరికీ సుపరిచితుడు. ఆ చిత్రకారుడిలోనూ కవి దాగున్నాడు. ఈ 'శూన్యపోరాటం'లో తన కవితాత్మక శక్తిని రుజువు చేసుకున్నారు ఇంద్రజిత్. ఒక చిత్రకారుడు తన ఊహాచిత్రాలను కళ్లకు కట్టికట్టు చిత్రీకరించినట్లే, సమాజంలో ఏర్పడుతున్న అసమానతలపై కవి తన కవితాస్త్రాన్ని 'నినాద' స్థాయిలో ఎలుగెత్తి చాటారు. ఇంద్రజిత్, తన భావాలను కవితల రూపంలోనే కాక, తాను వేసిన రేఖా చిత్రాలలోను ప్రతి ఫలింపజేశారు. ఈయన ముమ్ముందు తన కవితా శక్తిని పదును పెట్టుకొని, చిక్కనైన కవిత్వాన్ని అందిస్తూనే ఉంటారని ఆశిద్దాం.

- చలపాక ప్రకాష్



"శూన్య పోరాటం'
కవితా సంపుటి, రచన : ఇంద్రజిత్, పేజీలు 64, వెల రూ 30/- ప్రతులకు : ఎస్వీ కృష్ణ జయంతి, 203 కంచి రెసిడెన్సీ, 11-19, పి & టి కాలని, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500 060.

గోధుమ హల్వా

కావలసిన వస్తువులు

గోధుమలు	:	రెండు కప్పులు
పంచదార	:	రెండు కప్పులు
నెయ్యి	:	ఒకటిన్నర కప్పు
కిస్‌మిస్	:	50 గ్రాములు
జీడిపప్పు	:	50 గ్రాములు
ఏలకులు	:	ఎనిమిది
కలర్	:	మనకు నచ్చినది

తయారుచేసే విధానం

ముందుగా గోధుమలను శుభ్రం చేసి ముందు రోజు రాత్రి నానబెట్టు కోవాలి. తెల్లవారి వాటిని కడిగి మిక్సీలో వేయాలి. దీనిని వడకట్టి మరోసారి ఆ పిప్పిని మిక్సీలో వేసి పాలను తీయాలి. ఈ పాలను ఒక గిన్నెలోకి తీసుకొని అందులో పంచదార కలిపి పొయ్యి మీద పెట్టాలి. ఈ మిశ్రమాన్ని సన్నని సెగ మీద అడుగంటకుండా తిప్పుతూ ఉండాలి. యాలకులు పొడి చేసి అందులో వేయాలి. నెయ్యి బాగా కాగనిచ్చి పాకంలో పోస్తూ కలుపుతూ ఉండాలి. ఇది బాగా దగ్గర పడుతుండగా కావాలంటే కలర్ కలపాలి. కలర్ లేకున్నా బాగుంటుంది. దీనిని ఒక నెయ్యి రాసిన పళ్ళెంలో పోసి సమంగా సర్ది జీడిపప్పు, కిస్‌మిస్‌ను అలంకరించాలి. పాకం చల్లారిన తరువాత మనకు నచ్చిన ఆకారంలో ముక్కలు కోసుకోవాలి.

గోధుమ దోసెలు

కావలసిన వస్తువులు

గోధుమ పిండి	:	ఒక కప్పు
బియ్యప్పిండి	:	రెండు కప్పులు
పుల్ల పెరుగు	:	ఒక కప్పు
జీలకర్ర	:	ఒక టేబుల్ స్పూన్
కొత్తిమీద	:	ఒక కట్ట
పచ్చిమిర్చి	:	నాలుగు
ఉల్లిపాయలు	:	రెండు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం

ముందుగా గోధుమ పిండి, బియ్యప్పిండిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దానిలో జీలకర్ర, ఉప్పు, పెరుగు వేసి నీరు పోస్తూ దోసెల పిండిలా కలపాలి. దీనిని ఓ అరగంట నానబెట్టాలి. ఉల్లిపాయలు, మిర్చి, కొత్తిమీరను సన్నగా తరగాలి. తరువాత పొయ్యి మీద పెనం పెట్టి కాలిన తరువాత కొంచె నూనె వేసి ఈ పిండితో దోసెను వేయాలి. దాని మీద సన్నగా తరిగిన ఉల్లిపాయ, మిర్చి, కొత్తిమీర ముక్కలు పరచాలి. దోసె కాలిన తరువాత మధ్యకు మడిచి రెండు సార్లు అటూఇటూ తిప్పి తీయాలి. వీటిని వేడిగా చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.

- పి. జ్యోతి

నిజమైన స్నేహితుడు

శాఖమూరి శ్రీనివాస్



వెంకట్, రాము మంచి స్నేహితులు. ఎర్రపాడు వీరి స్వంత ఊరు. ఇద్దరూ ఐదవ తరగతి వరకు అక్కడి పాఠశాలలోనే చదివారు. వెంకట్‌ది బీద కుటుంబం. రాము తండ్రి మంచి ఆస్తిపరుడు. ఇద్దరూ తమ ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న వీణాపురి ఉన్నతపాఠశాలలో ఆరవతరగతిలో చేరారు.

చాలా రోజులపాటు ఇద్దరూ నడిచేవెళ్లారు. అయితే రాముకు వాళ్ల నాన్న కొత్త సైకిల్ తెచ్చాడు. వెంకట్, రాము కలిసి సైకిల్‌మీద పాఠశాలకు వెళ్లసాగారు. అలా కొద్ది రోజులు గడిచాయి.

సైకిల్ వుండడంతో రాముకు స్నేహితులు పెరిగారు. ఏవో ఖర్చులని చెప్పి తండ్రి దగ్గర తెచ్చిన డబ్బును రాము దుబారా చేయసాగాడు. వెంకట్ ఎన్నోసార్లు నచ్చజెప్పి చూశాడు. కానీ, రాము పట్టించుకోలేదు. అంతేకాక వెంకట్‌కు దూరంగా తిరగసాగాడు. సైకిల్‌మీద ఒక్కడే పాఠశాలకు రావడం మొదలుపెట్టాడు.

వార్షిక పరీక్షల తేదీలు ప్రకటించారు. ఇంకో నెలరోజుల్లో పరీక్షలు మొదలవుతాయి. స్నేహితులతో కలిసి వీణాపురిలోనే చదువుకుంటానని తండ్రితో చెప్పాడు రాము. కానీ... అప్పటివరకు జరిగిన అన్ని పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో వీణాపురికి పంపలేదు రామూ వాళ్లనాన్న. ఆడుతూ, పాడుతూ సంతోషంగా చదువుకోవచ్చని ఆశపడ్డ రాము బాధపడ్డాడు. అయితే తండ్రికి ఎదురుచెప్పలేక, ఎర్రపాడులోనే పరీక్షలకు చదవసాగాడు.

అయితే వెంకట్‌తో కలవడంలేదు. వెంకట్‌కూడా విడిగానే చదువుకోసాగాడు. నెలరోజులు గడిచాయి. ఈ మధ్యలో పాఠశాలకు వెళ్లి హాల్‌టిక్కెట్‌లను కూడా తెచ్చుకున్నారు.

రాము పరీక్షలు ప్రారంభమైన మొదటిరోజు ఉదయాన్నే, కొద్దిసేపు చదువుకున్నాడు. తర్వాత పరీక్షకు కావలసిన కలం, అట్ట, హాల్‌టిక్కెట్ తీసుకుని సైకిల్‌మీద వీణాపురికి బయలుదేరాడు. రాము సైకిల్‌పై బయలుదేరడం వెంకట్ చూశాడు. సైకిల్‌మీద అయితే ముందుగానే వెళ్లొచ్చని 'రామూ... నేనూ వస్తాను. నన్నూ తీసుకెళ్లవూ. సగం దూరం సైకిల్ నేను తొక్కుతానులే...' అని బతిమాలాడు.

వెంకట్ మాటలు వినబడనట్టే వేగంగా సైకిల్‌మీద దూసుకుపోయాడు రాము. చేసేదేమీలేక నడుచుకుంటూ వీణాపురికి బయలుదేరాడు వెంకట్.

పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే వెంకట్ పాఠశాల దరిదాపుల్లోకి వచ్చాడు. అక్కడ బాటకు ఇరువైపులా చాలా ముళ్ల పొదలు వున్నాయి. దాంతో దారిని జాగ్రత్తగా చూస్తూ నడవసాగాడు. అంతలో వెంకట్ దృష్టి ముళ్ల కంపలో చిక్కుకుని గాలికి శబ్దం చేస్తున్న ఓ కాగితంపై పడింది. దాన్ని తీసి చూసి ఆశ్చర్యపోయాడు. అది రాము హాల్‌టిక్కెట్!

హడావుడిగా వెళ్లడంతో ఎదురుగాలికి జేబులోని హాల్‌టిక్కెట్ పడిపోయి వుంటుందని ఊహించాడు వెంకట్. దాన్ని భద్రంగా జేబులో దాచి పాఠశాలవైపు నడిచాడు.

పాఠశాలలో కోలాహలంగా వుంది. విద్యార్థులంతా బోర్డ్ మీద తమ నెంబర్లను, పరీక్ష రాయబోయే గదులనూ చూస్తున్నారు. వెంకట్‌కూడా తన రూమ్ నెంబర్ చూసుకుని, రాముకోసం వెతకసాగాడు. ఎక్కడా కనిపించలేదు. పరీక్షకు సమయం దగ్గరపడుతోంది.

ఇంతలో ప్రధానోపాధ్యాయుని గదిలోంచి ఏడ్చుకుంటూ వస్తోన్న రాము కనిపించాడు. దగ్గరికెళ్లిన వెంకట్‌తో 'ఒరేయ్... నా హాల్ టిక్కెట్ ఎక్కడో పోయింది. ఎంత వెతికినా కనిపించలేదు. హెడ్మాస్టర్‌గారు అది లేకుంటే పరీక్ష రాయనివ్వనంటున్నారు' అన్నాడు వెక్కివెక్కి.

'రామూ... అదృష్టంకొద్దీ అది దారిలో ముళ్లకంపకు చిక్కుకుని నాకు దొరికింది. నీ కోసమే ఆత్రుతగా చూస్తున్నాను. ఈలోపు నువ్వే కనిపించావు. ఇంద తీసుకో.... నువ్వేమీ బాధపడకు' అంటూ హాల్‌టిక్కెట్ ఇచ్చాడు వెంకట్.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది రాముకు. వెంకట్‌తో తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది.

'వెంకట్ నన్ను క్షమించు. నువ్వు నాకు నిజమైన స్నేహితుడివి. నేను సహాయం చేయకున్నా... ఎంతో సహాయం చేశావు' కళ్లనిండా నీళ్లతో చెప్పాడు రాము.

రాము చేతిలో చేయివేస్తూ 'రామూ... అన్నీ మర్చిపోదాం. ఇదివరకులాగే కలిసిమెలిసి వుందాం' అన్నాడు వెంకట్.

ఇక ఎన్నడూ వాళ్లు తమ స్నేహాన్ని వీడలేదు.